జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక



సంపుటి :13 | సంచిక :63 | శుక్రవారం | 6-11-2026 | పేజీలు:8 | వెల:రు 3 | https://www.epaperjournalistdiary.com/

అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు
రొనాల్డో వీడ్కోలు!

- 23 ఏళ్ల పోర్చుగల్ ప్రస్థానానికి ముగింపు పలికిన ఫుట్‌బాల్ దిగ్గజం
- 234 మ్యాచ్‌లు.. 146 గోల్స్‌తో ప్రపంచ రికార్డులు
- 7వ నంబర్ జెర్సీని తర్వాతి తరం ఆటగాడికి అందిస్తానని ప్రకటన
- కోచ్ జార్జ్ జీసస్‌తో విభేదాల తర్వాత కీలక నిర్ణయం
- 2016 యూరో కప్, 2019, 2025 నేషన్స్ లీగ్ టైటిళ్లలో కీలక పాత్ర
- ఆరు ప్రపంచకప్ టోర్నీల్లో గోల్స్ చేసిన ఏకైక ఆటగాడిగా ఘనత



దేశవ్యాప్తంగా
వందే భారత్ హవా..

- నిండిపోతున్న సీట్లు, స్లీపర్లకు ఫుల్ డిమాండ్
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో వందే భారత్ రైళ్లకు భారీ స్పందన
- తిరువనంతపురం-మంగళూరు రూట్‌లో 189% రికార్డు స్థాయి ఆక్యుపెన్సీ
- తొలి వందే భారత్ స్లీపర్‌కు కూడా 114% పైగా ఆక్యుపెన్సీ నమోదు
- బెంగళూరు-ముంబై మధ్య కొత్త స్లీపర్ రైలును ప్రకటించిన రైల్వే శాఖ
- దేశవ్యాప్తంగా చైర్ కార్ రైళ్లలో దాదాపు 100% నిండుతున్న సీట్లు





అయ్యప్ప సొసైటీపై
సర్వే చేయాలి

- రేవంత్ సర్కారుకు టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత నెల రోజుల డెడ్‌లైన్
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 750 అక్రమ కట్టడాలు జరిగాయని ఆరోపణ
- సీఎం సోదరులే అనుమతులు ఇప్పించి డబ్బులు వసూలు చేస్తున్నారని వ్యాఖ్య
- సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారని ప్రశ్న
- కట్టడాలకు తమ కార్యకర్తలే రెడ్‌మార్క్ వేస్తారని హెచ్చరిక
- అయ్యప్ప సొసైటీలో రిజిస్ట్రేషన్లు జరగవని వెల్లడి
- అక్కడ ఇళ్లు కొనుగోలు చేసి నష్టపోవద్దని ప్రజలకు సూచన

హైదరాబాద్, సిటీ బ్యూరో,

: ఖానామెట్‌లోని అయ్యప్ప సొసైటీలో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి నెల రోజుల గడువు ఇస్తున్నామని తెలిపారు. ఈలోగా ప్రభుత్వం స్పందించకపోతే తమ పార్టీ కార్యకర్తలే అక్రమ కట్టడాలకు 'రెడ్ మార్క్' వేస్తారని హెచ్చరించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

-మిగతా 2 లో

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి
వేడుకలు

రాష్ట్రవ్యాప్తంగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమం

- 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో వేడుకలు
- నవంబర్ 19న సిద్దిపేటలో ఇందిరా గాంధీ జయంతి సభ
- అదే రోజు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం
- ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా
- నవంబర్ 20 నుంచి 30 వరకు గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ
- ఉమ్మడి ఎస్సీ, ఎస్టీ కమిషన్ రద్దు.. వేర్వేరు కమిషన్లు
- ఫైర్ సర్వీస్, సర్వే చట్టాల సవరణలకు కేబినెట్ ఆమోదం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా దీపావళి వేడుకలు నిర్వహించాలని తెలంగాణ మంత్రిమండలి నిర్ణయించింది. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లకు మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లి లబ్ధిదారులతో పండుగలో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయంతోపాటు పలు కీలక అంశాలకు ఆమోదం తెలిపారు. నవంబర్ 19న సిద్దిపేటలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సభ నిర్వహించి, అదే రోజు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభించనున్నారు. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి కూడా కేబినెట్ పచ్చజెండా ఊపింది. నవంబర్ 20 నుంచి 30 వరకు గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించనున్నారు.

హైదరాబాద్, సిటీ బ్యూరో,

దీపావళి పండుగను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 2,25,000 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొనాలని నిర్ణయించారు.

-మిగతా 2 లో





ప్రళయ్ మిస్సైల్ రెడీ

- వినియోగదారు మూల్యాంకన పరీక్షల్లో విజయవంతమైన దేశీయ క్షిపణి
- ఒడిశా తీరంలోని అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ప్రయోగం
- నిర్దేశించిన అన్ని లక్ష్యాలు సాధించినట్లు డీఆర్‌డీఓ ప్రకటన
- త్వరలోనే భారత సాయుధ దళాల్లోకి ప్రళయ్ క్షిపణి
- పరీక్షను ప్రత్యక్షంగా వీక్షించిన సైనిక, రక్షణ రంగ అధికారులు
- హైదరాబాద్‌లోని లీసెర్ట్ సెంటర్ ఇమారత్ కీలక పాత్ర
- 150 నుంచి 500 కిలోమీటర్ల పరిధిలో లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం

ఓటు వేయని జగన్‌కు ఎన్నికలపై మాట్లాడే నైతిక హక్కు లేదు..

- పాస్మూరు ఎమ్మెల్యే భూశెపొళ్ల నరేంద్ర
- ప్రజా తీర్పును గౌరవించడంలో జగన్ దీఎన్‌పతోనే లేదన్న నరేంద్ర
- అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలు గొప్ప.. ఇప్పుడు దౌర్జన్యమా అని ప్రశ్న
- అసెంబ్లీ, స్థానిక ఎన్నికల ఓటమిని జీర్ణించుకోలేకే వైసీపీ ఆరోపణలు



అధిక వడ్డీలు వసూలు చేస్తూ
ప్రజలను వేధిస్తున్న ముఠా అరెస్ట్





కేసు వివరాలను వెల్లడిస్తున్న మల్కాజ్గిరి సీపీ సుమతి

మహిళా డాక్టరుకు రుణాలు ఇచ్చి వేధించడంతో వెలుగులోకి

జర్నలిస్టు డైరీ,ఎల్బీనగర్ :

హైదరాబాద్ నగరంలో అధిక వడ్డీలు వసూలు చేస్తూ ప్రజలను పీడిస్తున్న ముఠాగుట్టును ఎల్బీనగర్ పోలీసులు, ఎల్బీనగర్ ఎస్ఓటి బృందం చేదించింది. ముఠాలో ఆరుగురిని అరెస్టు చేసి కార్లను స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతి గురువారం ఎల్బీనగర్ లోని సీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సీపీ కథనం ప్రకారం... మణికొండకు చెందిన ఉండే డాక్టర్ లక్ష్మి నాద్గిర్ చింతలకుంటలోని రెయిన్బో హస్పిటల్లో విజిటింగ్ కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ పనిచేస్తుంది. బాధితురాలు తన వైద్య సేవల నిమిత్తం సుమారు రూ.30 లక్షల విలువైన డ్రైవెన్ క్యాన్సర్స్ డిటెక్షన్ మెషీన్ ను కొనుగోలు చేయాలనుకున్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టు మొదటి వారంలో ఫిల్మ్ నగర్ లోని ఒక సెలూన్లో షీలా అనే మహిళతో పరిచయం ఏర్పడింది. వైద్య పరికరాల కొనుగోలుకు ఆర్థిక సహాయం (ఫైనాన్స్) ఇప్పించగల వ్యక్తులు తనకు తెలుసని షీలా నమ్మబలికింది. ఈ క్రమంలో షీలా బాధితురాలిని మన్సూరాబాద్లోని తన నివాసానికి తీసుకెళ్లి రాణి, వరుణ్, జ్యోతి, లక్ష్మి, ఆలియస్ లత, విజయ్లను పరిచయం చేసింది. నిందితులు రుణాలు ఇప్పిస్తామని నమ్మించి, బాధితురాలి వద్ద నుండి విడతలవారీగా పెద్ద ఎత్తున నగదు వసూలు చేశారు. కేవలం రూ. 2 లక్షలు ఇస్తామని చెప్పి, అందులో ఒక వారం వడ్డీ కింద రూ.60 వేలు మినహాయించుకుని కేవలం రూ. 1,40 లక్షలు మాత్రమే ఇచ్చి, దానికి రెట్టింపు మొత్తానికి రూ.4,50 లక్షల ప్రామిసరీ నోట్లు, ఖాళీ చెక్కులపై సంతకాలు తీసుకున్నారు. రాణి, జ్యోతి కలిసి అమెకు రూ. 1 లక్ష ఇస్తే రూ.12 లక్షలు రుణం ఇప్పిస్తామని ఆమెకు హామీ ఇచ్చారు. వారి మాటాలను నమ్మి వారికి బాధితురాలు రూ. 1 లక్ష నగదు రూపంలో చెల్లించింది. తము రూ. 20 లక్షలు రుణం ఇప్పిస్తామని నమ్మబలికి అమె వద్ద మరో సారి రాణి, షీలా రూ. 4,50 లక్షలు తీసుకున్నారు. ఇద్దరు డబ్బులు తీసుకున్న తరువాత ఎటువంటి ఆర్థిక సహాయం చేయలేదు. మరో రెండు రోజుల తర్వాత జ్యోతి అమెను కలిసి అవసరమైన

-మిగతా 2 లో

ఇవి ఎలక్షన్లా...?
లేక సెలక్షన్లా..

వైసిపి అధినేత వైఎస్. జగన్

-చంద్రబాబు గెలిచి ఓడారు.. మేము ఓడి గెలిచాం

-స్థానిక ఎన్నికల్లో అక్రమాలు, -రిగ్గింగ్ జరిగాయంటూ వైఎస్ జగన్ ధ్వజం

-ప్రజాస్వామ్యం ఖూనీ అయిందన్న జగన్



తాడేపల్లి,అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : రాష్ట్రంలో జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికల సందర్భంగా ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలోనే కాకుండా దేశంలో ఎక్కడా జరగని విధంగా స్థానిక ఎన్నికల్లో ప్రతి దశలోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. చంద్రబాబు ఈ ఎన్నికల్లో గెలిచినా ఓడిపోయినట్లేనని, తాము ఓడిపోయినా ప్రజల మనసుల్లో గెలిచామని వ్యాఖ్యానించారు. 'హే రామ్.. సేవ్ ఆంధ్రా.. హే రామ్.. సేవ్ డెమోక్రసీ' అంటూ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.

తాడేపల్లి లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో జగన్ మాట్లాడుతూ....

మొత్తం ఎన్నికల ప్రక్రియను చంద్రబాబు ప్రభుత్వం హైజాక్ చేసిందని, ప్రభుత్వం, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల సంఘం కుమ్మక్కై వ్యవహరించాయని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న స్వేచ్ఛాయుత ఎన్నికల హక్కును పూర్తిగా కాలరాశారని, అసలు ఇవి ఎన్నికలా? లేక సెలక్షన్లా? అని ప్రశ్నించారు.

ప్రతి దశలోనూ అక్రమాలే..

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఫలితాల వెల్లడివరకు ప్రతి దశలోనూ అధికార దుర్వినియోగం జరిగిందని జగన్ ఆరోపించారు. తమ పార్టీ నాయకులను పోలీస్ స్టేషన్లకు పిలిపించి బెదిరించడం, బైండోవర్ కేసులు పెట్టడం ద్వారా అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని అన్నారు. నామినేషన్ల పరిశీలన సమయంలో పత్రాలు మాయం చేయడం, లేని కారణాలు చూపించడం, ఫోర్జరీ సంతకాలతో నామినేషన్లు తిరస్కరించడం వంటి చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. అనంతరం అభ్యర్థులను బలవంతంగా నామినేషన్లు ఉపసంహరించుకునేలా చేశారని ఆరోపించారు.

పోలింగ్ బూత్‌ల వద్ద రిగ్గింగ్,

పోలింగ్ ప్రక్రియలో అక్రమాలు, పోలింగ్ శాతాల మార్పులు, రాత్రివేళ బ్యాలెట్ బాక్సుల విషయంలో అవకతవకలు జరిగాయని అన్నారు. తమ పార్టీ అభ్యర్థులు ఎక్కడైనా గెలిచినప్పటికీ ఫలితాల్లోనూ అక్రమాలకు పాల్పడ్డారని

-మిగతా 2 లో

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

అయ్యప్ప సొసైటీపై సర్వే చేయాలి

(మొదటి తరువాయి)

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీలో సుమారు 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులే దగ్గరుండి అనుమతులు ఇప్పిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. భూములు, టీడీఆర్ అక్రమ దందాలపైనే సీఎం దృష్టి ఉందని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అయ్యప్ప సొసైటీలో రిజిస్ట్రేషన్లు జరగవని, అక్కడ ఇళ్లు కొనుగోలు చేసి ప్రజలు నష్టపోవద్దని కవిత సూచించారు. గురుకుల ట్రస్ట్ భూముల విషయంలో గతంలో తమ పార్టీ ఎన్నో ఉద్యమాలు చేసిందని గుర్తుచేశారు. ఇదే సొసైటీలో నారాయణ, చైతన్య వంటి విద్యాసంస్థలు కూడా ఉన్నాయని తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనపైనా కవిత స్పందించారు. ఆయన పర్యటనలో రాజకీయ అంశాలపైనే మాట్లాడి వెళ్లారని, రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులపై స్పందించలేదని విమర్శించారు. అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం నెల రోజుల్లోగా సర్వే నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వేడుకలు

(మొదటి తరువాయి)

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని నవంబర్ 19న సిద్దిపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అలాగే రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ పథకం అమలుకు సంబంధించి నవంబర్ 20 నుంచి 30 వరకు గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఉమ్మడి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రద్దు చేసి, రెండు వర్గాలకు వేర్వేరుగా కమిషన్లు ఏర్పాటు చేయాలని కేబినెట్ తీర్మానించింది. ఇందుకు అనుగుణంగా తెలంగాణ స్టేట్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ కాస్ట్స్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ యాక్ట్--2003ను రద్దు చేసేందుకు ఆమోదం తెలిపింది. ఒక్కో కమిషన్‌లో ఒక చైర్మన్‌తో పాటు ఐదుగురు సభ్యులు ఉంటారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ ఫైర్ సర్వీస్ యాక్ట్--1999 సవరణకు సంబంధించిన ఆర్డినెన్స్ జారీకి కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదాలకు కారణాలను గుర్తించడం, వాటిపై తక్షణమే స్పందించడం వంటి అంశాలకు ఇందులో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల యజమానులు తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తలతో పాటు అగ్నిమాపక శాఖ చేపట్టాల్సిన చర్యలను సవరణలో పొందుపరచనున్నారు. తెలంగాణ సర్వే అండ్ బౌండరీస్ యాక్ట్--1923లోని సెక్షన్ 12(ఏ) సవరణ ప్రతిపాదనకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. సర్వే, సరిహద్దులకు సంబంధించి జారీ చేసే నోటీసులపై అప్పీల్ చేసుకునేందుకు ప్రస్తుతం ఉన్న 60 రోజుల గడువును 30 రోజులకు తగ్గించాలని నిర్ణయించింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి మీడియాకు వెల్లడించారు.

అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రొనాల్డో వీడ్కోలు!

న్యూఢిల్లీ:

ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో సంచలన నిర్ణయం తీసుకున్నాడు. పోర్చుగల్ జాతీయ జట్టు తరఫున తన అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్లు ప్రకటించాడు. 23 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానానికి వీడ్కోలు చెబుతూ సోషల్ మీడియాలో భావోద్వేగ వీడియోను పంచుకున్నాడు. పోర్చుగల్ కోసం తన శక్తినంతా ధారపోశానని, తన ప్రయాణం పట్ల గర్వంగా ఉందని పేర్కొన్నాడు. తనకు ఎంతో ప్రత్యేకమైన 7వ నంబర్ జెర్సీని తర్వాతి తరం ఆటగాడికి అందించనున్నట్లు వెల్లడించాడు. అభిమానులు, కుటుంబ సభ్యులు, సహచర ఆటగాళ్లకు కృతజ్ఞతలు తెలిపాడు. రొనాల్డో అంతర్జాతీయ కెరీర్ ముగింపు ప్రకటనకు ముందు పోర్చుగల్ జట్టులో చోటుచేసుకున్న పరిణామాలు చర్చనీయాంశమయ్యాయి. ప్రధాన కోచ్ జార్జ్ జీసస్‌తో అతడికి విభేదాలు తలెత్తాయి. నార్వేతో జరిగిన నేషన్స్ లీగ్ మ్యాచ్‌లో పోర్చుగల్ 2-1తో గెలిచినా రొనాల్డోకు ఆడే అవకాశం దక్కలేదు. తొలుత విశ్రాంతి ఇస్తామని, ఆ తర్వాత సుమారు 30 నిమిషాలు ఆడిస్తానని కోచ్ హామీ ఇచ్చారని, అయినా అవకాశం కల్పించలేదని అతడు అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ వివాదం నేపథ్యంలో డెన్మార్క్‌తో మ్యాచ్‌కు ముందు జట్టు శిబిరం నుంచి వెళ్లిపోయాడు. అనంతరం తన నిర్ణయం



తప్పేనని అంగీకరించి సహచరులు, అభిమానులకు క్షమాపణలు చెప్పాడు. ఈ ఘటనపై సమాఖ్య విధించిన 30 రోజుల సస్పెన్షన్, 255 యూరోల జరిమానాను తర్వాత వెనక్కి తీసుకుంది. 2003 ఆగస్టులో కజకిస్థాన్‌తో మ్యాచ్ ద్వారా పోర్చుగల్ జట్టులోకి అరంగేట్రం చేసిన రొనాల్డో.. మరుసటి ఏడాదే యూరో-2004 ఫైనల్ ఆడాడు. 2016 యూరో కప్ ఫైనల్‌లో ఫ్రాన్స్‌తో తలపడుతూ గాయంతో తొలి అర్ధభాగంలోనే మైదానం వీడినా, పక్కన నిలబడి సహచరులను ప్రోత్సహించాడు. అదనపు సమయంలో ఎడెర్ చేసిన గోల్‌తో పోర్చుగల్ తొలి యూరో కప్ టైటిల్ సాధించింది. 2019లో స్విట్జర్లాండ్‌పై హ్యాట్రిక్ సాధించి నేషన్స్ లీగ్ తొలి టైటిల్ గెలవడంలోనూ రొనాల్డో కీలక పాత్ర పోషించాడు. 2025లో స్పెయిన్‌తో ఫైనల్‌లో గోల్ చేసి రెండోసారి నేషన్స్ లీగ్ విజేతగా నిలిచిన జట్టులో భాగమయ్యాడు. పోర్చుగల్ తరఫున 234 మ్యాచ్‌లు ఆడి 146 గోల్స్ చేసిన రొనాల్డో.. పురుషుల అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక మ్యాచ్‌లు, అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా ప్రపంచ రికార్డులు నెలకొల్పాడు. యూరో కప్ చరిత్రలో 14 గోల్స్, 30 మ్యాచ్‌లతోనూ రికార్డులు సాధించాడు. 2026 ప్రపంచకప్‌లో ఆరు వేర్వేరు టోర్నీల్లో గోల్స్ చేసిన తొలి ఆటగాడిగా మరో ఘనత అందుకున్నాడు. అయితే రొనాల్డో కెరీర్‌లో ప్రపంచకప్ టైటిల్ మాత్రం అందని కలగానే మిగిలింది. 2006లో పోర్చుగల్ సెమీఫైనల్ చేరడమే ఆ టోర్నీలో అతడి అత్యుత్తమ ప్రదర్శన. 2022లో మొరాకో చేతిలో క్వార్టర్ ఫైనల్లో, 2026లో స్పెయిన్ చేతిలో ప్రిక్వార్టర్ ఫైనల్లో పోర్చుగల్ ఓటమి పాలైంది. అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికినా క్లబ్ ఫుట్‌బాల్‌లో అల్ నసర్ తరఫున రొనాల్డో కొనసాగనున్నాడు. కెరీర్‌లో 1,000 గోల్స్ మైలురాయిని చేరుకోవడానికి అతడు ప్రయత్నిస్తున్నాడు.

దేశవ్యాప్తంగా వందే భారత్ హవా..

న్యూఢిల్లీ:

దేశంలో సెమీ హైస్పీడ్ రైళ్లుగా ప్రవేశపెట్టిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నమోదైన ఆక్యుపెన్సీ గణాంకాలు ఈ రైళ్లకు పెరుగుతున్న ఆదరణను చాటుతున్నాయి. ముఖ్యంగా తిరువనంతపురం సెంట్రల్--మంగళూరు సెంట్రల్ మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ 189.35 శాతం ఆక్యుపెన్సీతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా చైర్‌కార్ సర్వీసుల సగటు ఆక్యుపెన్సీ 99.10 శాతంగా నమోదైంది. రైల్వే బోర్డు అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం.. తిరువనంతపురం నుంచి మంగళూరు వెళ్లే వందే భారత్ రైలు (20632)లో 189.35 శాతం ఆక్యుపెన్సీ నమోదైంది. మంగళూరు నుంచి తిరువనంతపురం వచ్చే రైలు (20631)లో 174.77 శాతం ఆక్యుపెన్సీ కనిపించింది. సాధారణంగా 100 శాతం దాటిన ఆక్యుపెన్సీ అంటే అందుబాటులో ఉన్న సీట్ల కంటే ప్రయాణానికి ఎక్కువ మంది రిజర్వేషన్ కోరుతున్నారని, వెయిటింగ్ లిస్ట్ పెరుగుతోందని అర్థం. ఢిల్లీ--వారణాసి మధ్య నడిచే రెండు జతల వందే భారత్ చైర్‌కార్ సర్వీసుల్లోనూ 114 నుంచి 117 శాతానికి పైగా ఆక్యుపెన్సీ నమోదవుతోంది. స్లీపర్ రైళ్లకూ ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. జనవరి 2026లో ప్రారంభమైన తొలి వందే భారత్ స్లీపర్ రైలు హౌరా--కామాఖ్య మధ్య నడుస్తోంది. ఈ సర్వీసులో 114.54 శాతం ఆక్యుపెన్సీ నమోదైనట్లు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తన కథనంలో పేర్కొంది. పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ మరిన్ని స్లీపర్ సర్వీసులను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. కర్ణాటకకు రెండో వందే భారత్ స్లీపర్ రైలును కేటాయించినట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఇటీవల ప్రకటించారు. ఈ రైలు బెంగళూరు నుంచి హుబ్బళ్లి మీదుగా ముంబై వరకు నడవనుంది. దీనివల్ల ఉత్తర కర్ణాటకతో పాటు పుణె, ముంబై నగరాలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది. మరోవైపు ఢిల్లీ--వారణాసి మార్గంలో అక్టోబర్ 31, 2026న వందే భారత్ స్లీపర్ రైలును ప్రారంభించినట్లు సమాచారం. 2019లో ప్రారంభమైన వందే భారత్ సేవలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా 160కి పైగా సర్వీసులకు విస్తరించాయి. ఈ ఆధునిక రైళ్లను చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో తయారు చేస్తున్నారు.

ప్రళయ్ మిస్సైల్ రెడీ

- -వినియోగదారు మూల్యాంకన పరీక్షల్లో విజయవంతమైన దేశీయ క్షిపణి
- -ఒడిశా తీరంలోని అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ప్రయోగం
- -గురువారం ఉదయం 11.10 గంటలకు పరీక్ష నిర్వహణ
- -నిర్దేశించిన అన్ని లక్ష్యాలు సాధించినట్లు డీఆర్‌డీఓ ప్రకటన
- -త్వరలోనే భారత సాయుధ దళాల్లోకి ప్రళయ్ క్షిపణి
- -పరీక్షను ప్రత్యక్షంగా వీక్షించిన సైనిక, రక్షణ రంగ అధికారులు
- -హైదరాబాద్‌లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ కీలక పాత్ర
- -150 నుంచి 500 కిలోమీటర్ల పరిధిలో లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం

న్యూఢిల్లీ:



భారత రక్షణ రంగంలో మరో కీలక విజయం నమోదైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన అత్యాధునిక ప్రళయ్ క్షిపణి వినియోగదారు మూల్యాంకన పరీక్షల్లో విజయవంతమైంది. దీంతో ఈ క్షిపణిని భారత సాయుధ దళాల్లో ప్రవేశపెట్టేందుకు మార్గం సుగమమైంది. త్వరలోనే సైన్యంలోకి ఈ క్షిపణి వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నట్లు రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) వెల్లడించింది. గురువారం ఉదయం సుమారు 11.10 గంటలకు ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ప్రళయ్ క్షిపణిని విజయవంతంగా ప్రయోగించారు. వినియోగదారు మూల్యాంకన పరీక్షలో భాగంగా ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) ఏర్పాటు చేసిన పర్యవేక్షణ పరికరాల ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించిన అనంతరం నిర్దేశించిన అన్ని లక్ష్యాలు పూర్తయినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ పరీక్షను డీఆర్‌డీఓ ఉన్నతాధికారులు, రక్షణ రంగ పరిశ్రమల ప్రతినిధులు, భారత సాయుధ దళాల అధికారులు ప్రత్యక్షంగా వీక్షించారు. తాజా పరీక్ష విజయవంతం కావడంతో ప్రళయ్ క్షిపణిని సైన్యంలోకి ప్రవేశపెట్టే ప్రక్రియ మరింత ముందుకు సాగింది. ఈ క్షిపణి అభివృద్ధిలో హైదరాబాద్‌కు చెందిన రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ) కీలక పాత్ర పోషించింది. ప్రళయ్ ఒక క్వాసీ బాలిస్టిక్ క్షిపణి. ఇది సుమారు 150 నుంచి 500 కిలోమీటర్ల పరిధిలో లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం కలిగి ఉంది.

అధిక వడ్డీలు వసూలు చేస్తూ
ప్రజలను వేధిస్తున్న ముఠా అరెస్ట్

(మొదటి తరువాయి)

డబ్బును ఇప్పిస్తానని హామీ ఇచ్చి రూ.80 వేలు ఇచ్చి బాధితురాలు నుండి రూ.2 లక్షల విలువైన ప్రామిసరీ నోటు, రెండు ఖాళీ చెక్కులను తీసుకుంది. రెండు రోజుల్లోనే జ్యోతి మళ్లీ నాకు రూ.2 లక్షలు ఇస్తే రూ. 20 లక్షల రుణం ఇప్పిస్తానని నమ్మబలకడంతో జ్యోతి మాట్లాలను నమ్మిన బాధితురాలు అమెకు రూ. 2 లక్షలు చెల్లించింది. జ్యోతి అమెకు రుణం ఇప్పిలేదు. అనంతరం వరుణ్ అనే వ్యక్తి డాక్టర్ను సంప్రదించి రాణి, షీలా నిన్ను మోసం చేశారని తనకు తెలిసిందని చెప్పాడు. నీవు ఇచ్చిన డబ్బును తిరిగి ఇప్పించడంలో సహాయపడతానని మీకు కావలసిన రూ.20 లక్షలు రుణం ఇప్పిస్తానని అమెకు హామీ ఇచ్చాడు. అతను అమె నమ్మకాన్ని గెలుచుకోవడానికి డబ్బును చూపించి, మరి కొన్ని హామీలు ఇచ్చారు. మొదట రూ.3 లక్షలు ఇస్తానని చెప్పి ఆమెకు రూ.2,40 లక్షలు మాత్రమే ఇచ్చి రూ.3 లక్షలు ప్రామిసరీ నోటును తీసుకున్నాడు. రూ.30 లక్షలు రుణం ఇప్పిస్తానని నమ్మబలికి రూ.5 లక్షల కోసం మరో ప్రామిసరీ నోటును కూడా తీసుకున్నాడు. వీటితో పాటు అమె నుండి మరో రెండు ఖాళీ చెక్కులను కూడా తీసుకున్నాడు. అతను అమెకు ఎలాంటి రుణం ఇప్పించలేదు. తర్వాత వరుణ్ అమెను రూ. 8 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ఫోన్ ద్వారా నిరంతరం బెదిరించడం మొదలు పెట్టాడు. బాధితురాలిని చంపుతానని, కాళ్ళు, చేతులు విరగ్గొడతానని, ఇంటిపైకి 20 మందిని పంపి దాడి చేస్తానని ఫోన్లో తీవ్రంగా బెదిరించాడు. భయభ్రాంతులకు గురిచేసి బాధితురాలు రూ. 4



లక్షలు చెల్లిస్తానని ఒప్పుకుంది. డాక్టర్ను లక్ష్మి, ఆలియాస్ లతను సంప్రదించారు. అమె రూ. 4 లక్షలు రుణం ఇచ్చి రూ.10 లక్షలు ప్రామిసరీ నోటు రాసి

ఇచ్చింది. ఒక వారం తర్వాత లక్ష్మి ఆ లావాదేవీలకు సంబంధించి రూ, 10 లక్షలు డిమాండ్ చేస్తూ ఆ మొత్తాన్ని చెల్లిస్తే రూ. 25 లక్షలు రుణం ఇప్పిస్తానని హామీ ఇచ్చింది. అమె మాటలను నమ్మి బాధితురాలు లక్ష్మికి రూ. 10 లక్షలు చెల్లించింది. తరువాత అమె లోన్ ఇప్పించలేదు. పైగా బాధితురాలను బెదిరిస్తూ రూ. 1, 40 లక్షలు విలువైన మొబైల్ పోన్ కావాలని డిమాండ్ చేసి తీసుకుంది. స్వప్న అనే మహిళ బాధితురాలని సంప్రదించి 24 గంటల్లోనే రుణం ఇప్పిస్తానని, డబ్బు కూడా అందజేస్తానని నమ్మబలికింది. ఆర్థిక లావాదేవీకి హామీగా అమె వద్ద ఉన్న టయోటా ఇన్నోవా హైక్రాస్ కారు స్వప్న అక్టోబర్ 7 వ తేదీన తీసుకుంది. డబ్బులు ఇవ్వకుండా బాధితురాలని బెదిరింపులకు పాల్పడుతూ కారును అమె ఆధీనంలోకి తీసుకుంది. అక్టోబర్ 9 వ తేదీన వరుణ్ బాధితురాలు ప్రయాణిస్తున్న స్కోడా కారును ఎల్బీనగర్ వద్ద అడ్డగించి బలవంతంగా లాక్కున్నాడు. దీంతో పాటు నిరతంరం పైన పేర్కొన్న వ్యక్తులు బాధితురాలని పదేపదే బెదిరించడం, వేధించడం, అక్రమ డిమాండ్లు చేయడంతో మానసిక వేదక గురైన బాధితురాలు అక్టోబర్ 24 వ తేదీన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. నిందితులు ఆమె వద్ద రూ. మొత్తం రూ.15,50 లక్షలు అక్రమంగా వసూలు చేశారని, రూ.24, 50 లక్షలు ప్రామిసరీ నోట్ల రాపించుకున్నారని, 6 ఖాళీ చెక్కులు తీసకున్నారని, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారని బాధితురాలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని సీనియర్ మహిళా డాక్టర్ పట్ల అమానుషంగా ప్రవర్తించి, మోసానికి పాల్పడి, ప్రాణహత్య బెదిరింపులకు గురిచేసి, కార్లను బలవంతంగా లాక్కున్న షీలా, రాణి, వరుణ్, జ్యోతి, లక్ష్మి, విజయ, స్వప్నలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు. మరో ముగ్గురు పరారి లో ఉన్నట్లు తెలిపారు. ఈ కేసును చేదించిన ఎల్బీనగర్ ఎస్ఓటి, ఎల్బీనగర్ పోలీస్ సిబ్బందిని సిపి సుమతి ప్రత్యేకంగా అభినందించారు.

ఇవి ఎలక్షన్లా...? లేక సెలక్షన్లా..

(మొదటి తరువాయి)

ఆరోపించారు. ఇన్ని అక్రమాల మధ్య గెలిచిన చంద్రబాబు గొప్పలు చెప్పుకుంటున్నారని, వాటిని ఎల్లో మీడియా ప్రచారం చేస్తోందని విమర్శించారు.

ఎస్ఈసీపై తీవ్ర విమర్శలు

రాష్ట్ర ఎన్నికల సంఘం తన నిష్పక్షపాత పాత్రను మరిచిపోయిందని జగన్ ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం పట్టించుకోలేదని, పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు సక్రమంగా జరగలేదని విమర్శించారు. పోలీసులు అధికార పార్టీ ఏజెంట్లుగా మారి పలు ప్రాంతాల్లో దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడ్డారని అన్నారు. ముఖ్యమంత్రి, డీజీపీ, కలెక్టర్లు, ఎస్పీలు, డీఎస్పీలు, అధికారులు, రిటర్నింగ్ అధికారులు సమన్వయంతో వ్యవస్థీకృతంగా ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేశారని ఆరోపించారు.

సౌత్ బీహార్‌గా ఆంధ్రప్రదేశ్

తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో సేఫ్ ఆంధ్రా అనే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం సేవ్ ఆంధ్రా అని పిలవాల్సిన పరిస్థితి వచ్చిందని జగన్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని, చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌ను సౌత్ బీహార్‌గా మార్చారని విమర్శించారు. తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర పరువును, ప్రజాస్వామ్య వ్యవస్థను ఫణంగా పెట్టారని ఆరోపించారు.

ప్రజాస్వామ్య హక్కులకే భంగం

ఎన్నికల్లో జరిగిన అక్రమాలు కేవలం ఎన్నికల ప్రక్రియను దెబ్బతీయడమే కాకుండా ప్రజల ఓటు హక్కును, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల హక్కులను సైతం కాలరాయడమేనని జగన్ అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను వ్యవస్థీకృతంగా ఖూనీ చేయడం చట్టప్రకారం హేయమైన నేరమని ధ్వజమెత్తారు. ఎన్నికల నిర్వహణలో ఇలాంటి పరిస్థితులు భవిష్యత్ తరాలకు తప్పుడు సంప్రదాయాన్ని పరిచయం చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పార్టీ శ్రేణులకు సెల్యూట్

ఎన్నో ఇబ్బందులు, దాడులు, బెదిరింపులు ఎదుర్కొన్నప్పటికీ నిలబడిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు జగన్ సెల్యూట్ తెలిపారు. అన్యాయం జరిగితే ప్రశ్నించడం, ఫిర్యాదు చేయడం కూడా నేరమా? అని నిలదీశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసినా కేసులు నమోదు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులతో తమ పార్టీని, నాయకులను, కార్యకర్తలను అడ్డుకోలేరని, అన్ని పరిణామాలను సమర్థంగా ఎదుర్కొంటూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ప్రెస్‌మీట్‌లో జగన్ ప్రస్తావించిన ముఖ్యాంశాల్లో నామినేషన్ల తిరస్కరణ, బలవంతపు ఉపసంహరణలు, పోలింగ్ ఏజెంట్లపై దాడులు, ఓట్ల రిగ్గింగ్, కౌంటింగ్ సమయంలో అక్రమాలు ప్రధానంగా ఉన్నాయి. దర్సి, కనిగిరి, టెక్కలి, కోటబొమ్మాళి, పలమనేరు, పులివెందుల నియోజకవర్గంలోని వేముల, లింగాల మండలాల్లో జరిగిన ఘటనలను ఆయన ఉదహరించారు. పోలీసుల సమక్షంలోనే ఓటర్లను అడ్డుకున్నారని, పోలింగ్ ఏజెంట్లపై దాడులు జరిగాయని ఆరోపించారు. పెట్రోల్ బాంబులతో పార్టీ కార్యకర్తలు, బూత్ ఏజెంట్లపై దాడులు జరిగినట్లు కూడా పేర్కొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో అధికారికంగా ప్రకటించిన పోలింగ్ శాతానికి, కౌంటింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్ల సంఖ్యకు తేడాలు ఉన్నాయని జగన్ ఆరోపించారు. కౌంటింగ్ టేబుళ్ల వద్ద ఓట్ల సంఖ్యను పెంచి చూపించారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో చోటు చేసుకున్న పరిణామాలు భవిష్యత్తులో ఎన్నికల సంస్కరణలకు ఒక అధ్యయన అంశంగా నిలుస్తాయని అన్నారు. అధికార యంత్రాంగాన్ని చంద్రబాబు తనకు అనుకూలంగా ఉపయోగించుకున్నారని, మహాభారతంలో శకుని మాయ పాచికల మాదిరిగా ఎన్నికల వ్యవస్థను నడిపించారని వ్యాఖ్యానించారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక నిలబెట్టుకోలేదని చంద్రబాబుపై విమర్శలు

సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలతో ప్రజలకు ఇచ్చిన మాటలను అధికారంలోకి వచ్చాక నిలబెట్టుకోలేదని చంద్రబాబుపై విమర్శలు చేశారు. మహిళలు, రైతులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మెడికల్ కాలేజీలు, పోర్టులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారని, తుఫాన్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలోనూ సామాన్యుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

ఎన్నికల్లో ఎదురైన ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కొని పోరాడిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు మరోసారి అభినందనలు తెలిపిన జగన్.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది కొరతపై బీజేపీ ఆగ్రహం

30 మంది సిబ్బంది అవసరమున్న చోట 13 మంది కూడా లేరు..

తక్షణమే వైద్య సదుపాయాలు కల్పించాలి

బిజెపి నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

చెరుకుపల్లి యువతి మృతి ఘటనపై సమగ్ర విచారణ జరపాలనీ డిమాండ్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :

కొందుర్గు మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన దళిత యువతి ప్రసవ సమయంలో మృతి చెందిన ఘటన నేపథ్యంలో షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని బీజేపీ నాయకులు సందర్శించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు ఆసుపత్రిని పరిశీలించి, సూపరింటెండెంట్‌తో వైద్య సేవలు, సిబ్బంది కొరతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో కనీసం 30 మంది వైద్య సిబ్బంది అవసరం ఉండగా, ప్రస్తుతం 13 మంది కూడా అందుబాటులో లేరని అధికారులు వెల్లడించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఈ పరిస్థితి ప్రభుత్వ వైద్య ఆరోగ్య వ్యవస్థలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతోందని విమర్శించారు. కేవలం వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, భవనాల విస్తరణతో పేదలకు మెరుగైన వైద్యం అందదని, అందుకు అనుగుణంగా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, అత్యాధునిక వైద్య పరికరాలు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పించాలని అక్రమంగా కేసు బనాయించారన్న ఆరోపణలపైనా విచారణ జరపాలని కోరారు. పేద కుటుంబాలపై నిందలు మోపి అసలు సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేయవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వైద్య వ్యవస్థపై బీజేపీ మౌనంగా ఉండబోదని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య సిబ్బంది, పరికరాలు, మౌలిక సదుపాయాలు కల్పించే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు..

శ్రీనివాస ఆగ్రో ఇండస్ట్రీస్ విజయవంతంగా ముందుకు సాగాలి

-బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్
-శ్రీనివాస ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న రవీందర్ యాదవ్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :

బాలానగర్ మండలం మోతిగానపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రీనివాస ఆగ్రో ఇండస్ట్రీస్ నూతన పరిశ్రమ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమ నిర్వాహకులు గబ్బుల శ్రీలత, శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా ప్రారంభమైన పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతూ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ చైర్మన్ ఉప్పల వెంకటేష్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య దేవేందర్ యాదవ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, సర్పంచ్ జెట్ట కుమార్, మాజీ సర్పంచులు శ్రవణ్ పట్వారీ, రాజు, మాజీ ఎంపీటీసీ రాజేందర్ గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

కరువు తాండవిస్తున్న... సర్కారు కనికరించడం లేదు

నేటికీ రైతు భరోసాపై స్పష్టత లేదు

గ్రామాల్లో పంటలన్నీ ఎండిపోతున్నాయి

రైతులకు సరిపడా కరెంటు లేదు, సాగు నీళ్లు లేవు

అన్ని వర్గాల రైతులు పుట్టెడు దుఃఖంలో ఉన్నారు

నష్టపోయిన ప్రతి రైతుకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించాలి

వచ్చే యాసంగి పంటలకు 100% రాయితీతో విత్తనాలు సరఫరా చేయాలి

50% రాయితీతో ఎరువులను అందజేయాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్

ఫరూఖ్ నగర్ మండలంలోని పలు గ్రామాలలో ఎండిన పంటలను పరిశీలించిన అంజయ్య యాదవ్, పార్టీ శ్రేణులు



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :

పల్లెల్లో కరువు తాండవిస్తున్న సర్కారు నుంచి కనీస స్పందన లేదని, ఎండిన పంటలను చూసి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఫరూఖ్ నగర్ మండలం కడియాల కుంట తండా తోపాటు పలు గ్రామాలలో ఎండిన పంటలను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. చరిత్రలో ఎన్నడు లేని విధంగా సెప్టెంబర్ అక్టోబర్ నెలలోనే రైతులు వేసిన పంటలు ఎండిపోయాయని, ఇలాంటి దురదృష్టకర వాతావరణం రావడం అత్యంత బాధాకరమని వాపోయారు. ఎలినో పరిస్థితుల వల్ల వర్షాలు పడవు అనే వాతావరణ శాఖ హెచ్చరించిన, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని తీవ్రస్థాయిలో ఆరోపించారు. వర్షాకాల ప్రారంభ సమయంలో గోదావరి కృష్ణా నదుల్లో వరద నీరుపారిన వాటిని ఎత్తిపోసుకోవడంలో ప్రభుత్వ దృష్టి సాధించలేదని, కేవలం రాజకీయాలకే ప్రాముఖ్యతను ఇచ్చిందని ఆరోపించారు. ముఖ్యంగా పాలమూరు వంటి జిల్లాలో కరువు అనేది సర్వసాధారణమైనది అనే నానుడి ఉందని, అయినప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకుండా రైతులను మరింత కష్టాలలోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగి పంటలు ప్రారంభమవుతున్నప్పటికీ నేటికీ రైతు భరోసా పై ప్రభుత్వానికి స్పష్టత లేదని, రైతులను ఏ విధంగా ఆదుకుంటారో చెప్పే పరిస్థితిలో ప్రభుత్వం లేదని వాపోయారు. గ్రామాలలో సాగుకు కరెంటు లేదు, సాగునీలు లేవు, సర్కారు మద్దతు లేదనీ, సరిపడా విద్యుత్ ఇస్తున్నామని చెప్పు ప్రభుత్వం ఎండిన పంటలకు ఎలాంటి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కరువు నేపథ్యంలో రానున్న యాసంగి పంటకైనా రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా 100% రాయితీతో విత్తనాలు, 50% రాయితీతో ఎరువులను అందజేయాలని డిమాండ్ చేశారు. ఉన్న నీళ్లతోనైనా బిందు సేద్యంను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. వానకాలంలో పండిన పంటకు ఎలాంటి షరతులు విధించకుండా మద్దతు ధరను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బక్కన్న యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ మౌనిక హరి, సర్పంచులు లక్ష్మణ్ నాయక్, రాజు నాయక్, మాజీ సర్పంచులు రంగయ్య గౌడ్, రాములు, రవీందర్ నాయక్, సాయి ప్రసాద్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు బిశ్వ రామకృష్ణ, పోచయ్య, నాయకులు రాయికల్ వెంకట్ రెడ్డి, ప్రభాకర్, ఎల్లయ్య, రెడ్యా నాయక్, చట్పట్ రవీందర్, నందిగామ శ్రీనివాస్, సంతోష్ గౌడ్, సురేష్, చందు లాల్, జంగయ్య యాదవ్, రాజేందర్, అద్నాన్, శేఖర్, పవన్, నర్సింలు, అంజయ్య, చంద్రకాంత్, మల్లేష్ నాయక్, దీప్లా నాయక్, గోవిందు నాయక్, గోవిందు రెడ్డి, వెంకటేష్ యాదవ్, గుండు అశోక్, రాఘవేందర్ గౌడ్, నవీన్, విజయ్, సిద్దు యాదవ్, నార్ల శ్రీనివాస్, సంజు నాయక్, శ్రీకాంత్, పవన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలతోనే

పర్యావరణ రక్షణ

-ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి
-తిమ్మాపూర్ లో ఈడెన్ &శుభమ్ ఈవీ ఎలక్ట్రిక్ వాహనాల షోరూం ప్రారంభోత్సవం
-ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :

కొత్తూరు:పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఎంతో దోహదపడుతుందని, భవిష్యత్తు అంతా ఈవీలదేనని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.కొత్తూరు మండలం లోని తిమ్మాపూర్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన ఈడెన్&శుభమ్ ఈవీ ఎలక్ట్రిక్ వాహనాల షోరూం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పెరుగుతున్న ఇంధన ధరల భారం నుంచి సామాన్యుడికి ఉపశమనం కలిగించడంతో పాటు, కాలుష్య రహిత సమాజ స్థాపనకు ఈవీ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.సరికొత్త సాంకేతికతతో,తక్కువ ఖర్చుతో ఎక్కువ మైలేజ్ ఇచ్చే మోడళ్లను స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా షోరూం నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్సి నవీన్ రెడ్డి.ఈ కార్యక్రమంలో షోరూం యాజమాన్యం,బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో ఆగని తెలంగాణ ఉద్యమకారుల అరెస్టుల పరంపర!

కార్మిక నేత పినపాక ప్రభాకర్ ,మాజీ జెడ్పీటీసీ పంది వెంకటరామిరెడ్డి, నక్కల వెంకటేష్ గౌడ్ లు అరెస్ట్

ఉద్యమకారులను ఇబ్బందులకు గురిచేయడం దుర్మార్గం..

సంబంధం లేని ప్రకటనలకు మమ్మల్ని బాధ్యులను చేయొద్దు

పోలీసుల తీరు పై పినపాక ప్రభాకర్ ఆగ్రహం







రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :

తెలంగాణ ఉద్యమకారుల అరెస్టుల వ్యవహారం షాద్‌నగర్‌లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ఉద్యమకారులు, మాజీ జెడ్పీటీసీ పంది వెంకటరామిరెడ్డి, పినపాక ప్రభాకర్‌లను షాద్‌నగర్ పోలీసులు మరోసారి అరెస్ట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సింది పోయి, అరెస్టుల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని తెలంగాణ ఉద్యమకారుడు పినపాక ప్రభాకర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని ఆశించామని అన్నారు. నిజమైన ఉద్యమకారులను గుర్తించి గౌరవిస్తుందని భావించామని, కానీ సంబంధం లేని అంశాల్లోనూ అరెస్టులు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు, సంఘాలు ఏవో ప్రకటనలు చేసినంత మాత్రాన వాటి వెనుక ఉన్న వాస్తవాలను తెలుసుకోకుండా ఉద్యమకారులను అరెస్ట్ చేయడం దుర్మార్గమని విమర్శించారు. ఉడత ఊపులకు భయపడే ప్రభుత్వం ప్రజలకు ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఉద్యమకారులను అనవసరంగా ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు.తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం లేదా తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ (టీయూ జేఏసీ) తరఫున ఏదైనా కార్యాచరణ చేపట్టాల్సి వస్తే బహిరంగంగా ప్రకటన చేసి ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. తమకు సంబంధం లేని, గుర్తింపు లేని సంఘాలు ఇచ్చే ప్రకటనలకు తమను బాధ్యులను చేస్తూ ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. పోలీసులు, ప్రభుత్వం ఇకనైనా ఇలాంటి చర్యలకు స్వస్తి పలకాలని, వాస్తవాలు తెలుసుకున్న తర్వాతే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఈ అరెస్టుల వ్యవహారంపై ఉద్యమకారుల తరఫున ఆందోళన చేపడతామని పినపాక ప్రభాకర్ హెచ్చరించారు..

ప్రతి పట్టభద్రుడిని కలిసి బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలి

-మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
-పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై తిమ్మాపూర్‌లో బీఆర్ఎస్ విస్తృత ప్రచారం



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు విస్తృతంగా పర్యటించి పట్టభద్రులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా కోస్గి భగవద్గీత శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కడంపల్లి శ్రీనివాస్, మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ దేవేందర్ యాదవ్, డోలి రవీందర్, శ్రీనివాస్, చింతగింది రాజేందర్ గౌడ్, జంగగాల కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, వెంకటపురం నాగరాజు, చింతకింది నరసింహ, బండి కృష్ణ, వెంకటేష్ డిష్, వెంకటేష్, శంకర్ రెడ్డి, రాఘవేందర్ యాదవ్, కోస్గి యాదయ్య, జి. నరసింహ, పట్నం చంద్రయ్య, పసుపుల శేఖర్, సిద్దేశ్వర్ గౌడ్, ప్రకాష్, ప్రమోద్, సాయి కిరణ్, హరీష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణదుర్గం ఎమ్మెల్యేపై దాడికి వైసీపీ యత్నం.. గన్‌మన్‌కు గాయాలు

-అనంతపురం జిల్లా పరిషత్ ఎన్నికల్లో తీవ్ర ఉద్రిక్తత
-ఓటేయకుండా అడ్డుకుంటున్నారని సురేంద్రకు మహిళల ఫిర్యాదు
-ఎమ్మెల్యే రాకను గమనించి దాడికి యత్నించిన వైసీపీ శ్రేణులు



కల్యాణదుర్గం,అనంతపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
పరిషత్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కళ్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రపై వైసీపీ శ్రేణులు దాడికి యత్నించాయి. ఈ క్రమంలో అడ్డుకున్న ఆయన గన్‌మన్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటనతో కుందుర్పి మండలం బెస్తరపల్లి పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే... బెస్తరపల్లి పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నేతలు తమను ఓటు వేయనీయకుండా బెదిరిస్తున్నారని 'పొదుపు లక్ష్మి' బృందానికి చెందిన మహిళలు ఎమ్మెల్యే సురేంద్రకు ఫోన్ చేశారు. దీంతో వారికి ధైర్యం చెప్పేందుకు ఎమ్మెల్యే స్వయంగా పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు.ఎమ్మెల్యే రాకను గమనించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ఆయనపై దాడికి ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన ఎమ్మెల్యే గన్‌మన్ వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో గన్‌మన్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో పోలింగ్ కేంద్రం వద్ద ఒక్కసారిగా గందరగోళం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు

ఎముకలు, కీళ్ల సమస్యలకు షాద్‌నగర్‌లో సేవలు!

-నాగులపల్లి రోడ్డులో శ్రీకాంత్ శ్రీ బోన్ సెట్టింగ్ సెంటర్ ప్రారంభం
-ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్
-కార్యక్రమానికి హాజరైన షాద్‌నగర్ జర్నలిస్టులు



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :
ఎముకలు, కీళ్లు, కండరాలకు సంబంధించిన సమస్యలతో బాధపడే ప్రజలకు సేవలు అందించాలనే లక్ష్యంతో షాద్‌నగర్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకాంత్ శ్రీ బోన్ సెట్టింగ్ సెంటర్ ప్రారంభమైంది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని నాగులపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మనిషి శరీరంలో ఎముకలు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తాయని, ఎముకలు, కీళ్లు, కండరాలకు సంబంధించిన సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సరైన సమయంలో వైద్య సలహాలు, చికిత్స పొందడం అవసరమని అన్నారు. ప్రమాదాల కారణంగా ఎముకలు విరగడం, కీళ్ల నొప్పులు, ఇతర ఎముకల సంబంధిత సమస్యలు ఎదురైనప్పుడు అర్హత కలిగిన వైద్య నిపుణులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. షాద్‌నగర్ పట్టణంలో నూతనంగా ప్రారంభమైన శ్రీకాంత్ శ్రీ బోన్ సెట్టింగ్ సెంటర్ ద్వారా స్థానిక ప్రజలకు అవసరమైన సేవలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించుకోవాలని, ఈ కేంద్రం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్ ఖాజా పాషా, రంగనాథ్, రాఘవేందర్, శరత్ కుమార్, సాయిశ్వర్ రెడ్డి, సురేష్, అవుల రమేష్, కౌన్సిలర్ మురళీమోహన్ అప్పి, సాదిక్, ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, బుడ్డ నరసింహ, మల్లేష్, సురేష్, రమేష్, మంగ మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సులో భాగంగా బియ్యం ధరల నియంత్రణ

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ డైరీ) నవంబర్ 05
ప్రజా శ్రేయస్సులో భాగంగా ప్రభుత్వం బియ్యం ధరల నియంత్రణ చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో సమత రైస్ డిపో వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం అమ్మకాల అవుట్ లెట్ ను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ, మండల తహసిల్దార్ వనజ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట ధరలకు మించి అమ్మకాలు జరుపకూడదని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్ లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ నిర్ణీత ధరకే విక్రయాలు జరిగేలా రెవెన్యూ,పౌర సరఫరాల శాఖల అధికారులతో ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన ప్రీమియం క్వాలిటీ బి.పి.టి. న్యూ రైస్ బ్యాగ్ ను 1 వేయి 352 రూపాయలు, స్టీమ్ రైస్ ను 1 వేయి 482 రూపాయలు, పాత బియ్యం 1 వేయి 638, హెచ్.ఎం.టి. పాత రకం బియ్యం బస్తా 1 వేయి 950 రూపాయలు, జై శ్రీరామ్ పాత బియ్యం 1 వేయి 976 రూపాయల చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయాలు జరుపుతామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో ముగిసిన జడ్పీటీసీ ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్.. ఎల్లుండి కౌంటింగ్

-చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా సాగిన ప్రక్రియ
-ప్రాథమిక అంచనాల ప్రకారం 65--68 శాతం పోలింగ్ నమోదు
-నవంబర్ 7న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి
-స్ట్రాంగ్ రూమ్‌లకు బ్యాలెట్ బాక్సుల తరలింపు





అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల సమరంలో కీలక ఘట్టమైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్, సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో వర్షం కారణంగా ఉదయం పోలింగ్ మందకొడిగా సాగినా, మధ్యాహ్నం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. చెదురుమదురు ఘర్షణలు, వాగ్వాదాలు మినహా పోలింగ్ ప్రక్రియ చాలా వరకు ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు.
మధ్యాహ్నం 3 గంటల వరకు58.55 శాతం పోలింగ్ నమోదు
మధ్యాహ్నం 3 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 58.55 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. పోలింగ్ ముగిసే సమయానికి ఈ శాతం 65 నుంచి 68 శాతం మధ్య ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. రాయలసీమ, కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనగా, కొన్ని గిరిజన, తీర ప్రాంతాల్లో పోలింగ్ శాతం కాస్త తక్కువగా నమోదైనట్లు సమాచారం. ఈ ఎన్నికల బరిలో నిలిచిన సుమారు 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది.
రాష్ట్రవ్యాప్తంగా 77 జడ్పీటీసీ స్థానాలు ఏకగ్రీవం
రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు గాను 77 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 9,821 ఎంపీటీసీ స్థానాలకు గాను 2,051 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఈరోజు పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగానే సాగింది.
కొన్ని చోట్ల వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదాలు, తోపులాటలు
అయితే పల్నాడు,అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదాలు, తోపులాటలు చోటు చేసుకున్నాయి. కొన్ని చోట్ల పెట్రోల్ బాంబులతో దాడులు జరిగాయి. కొన్ని చోట్ల ఇరు వర్గాలు కర్రలు, రాళ్లతో దాడులకు దిగడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అయితే, సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనల వల్ల పోలింగ్‌కు పెద్దగా అంతరాయం కలగలేదు.
కట్టుదిట్టమైన భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలింపు
పోలింగ్ ముగిసిన వెంటనే అధికారులు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీళ్లు వేసి, కట్టుదిట్టమైన భద్రత నడుమ వాటిని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఏవైనా కేంద్రాల్లో తీవ్రమైన అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయితే, నవంబర్ 6న అక్కడ రీ-పోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 7వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ ఫలితాల ఆధారంగా నవంబర్ 11, 12 తేదీల్లో ఎంపీపీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ల ఎన్నికలు జరగనున్నాయి. దీంతో స్థానిక ప్రజాప్రతినిధుల ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది.

దీపావళి క్రాకర్ షాపుల యజమానులకు భద్రతా సూచనలు...



నాగారం, నవంబర్ 5:-(జర్నలిస్ట్ డైరీ)
దీపావళి పండుగను పురస్కరించుకుని క్రాకర్ షాపుల యజమానులు తప్పనిసరిగా తగిన భద్రతా జాగ్రత్తలు పాటించాలని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి సూచించారు. ప్రతి క్రాకర్ షాపు ముందు నీళ్లు, ఇసుకతో పాటు అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. షాపుల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉంటూ, సురక్షిత వాతావరణంలో ప్రశాంతంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ఎస్‌హెచ్‌ఓ, ఇన్‌స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డితో పాటు ఎస్‌ఐలు సుధాకర్ రెడ్డి, వెంకన్న, సాయి, సతీష్, విజయ్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ నియామకాల్లో ట్రాన్స్ జెండర్స్‌కు ప్రాధాన్యత.. వారికి ప్రత్యేక శిక్షణ...మల్కాజిగిరి సిపి బి సుమతి



నాగారం, నవంబర్ 5:-(జర్నలిస్ట్ డైరీ)
తెలంగాణ పోలీస్ నియామకాలు 2026లో పోలీస్ కానిస్టేబుళ్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లుగా చేరాలనుకునే ట్రాన్స్‌జెండర్ అభ్యర్థుల కోసం ప్రత్యేక సాధికారత కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మల్కాజిగిరి సిపి బి సుమతి తెలిపారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ సహకారంతో, తెలంగాణ పోలీస్ శాఖలో 2026 నియామక ప్రక్రియలో భాగంగా పోలీస్ కానిస్టేబుళ్లు మరియు సబ్ ఇన్‌స్పెక్టర్లుగా చేరాలనుకునే ట్రాన్స్‌జెండర్ అభ్యర్థుల కోసం ప్రత్యేక సాధికారత కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు సిపి. తెలంగాణ మహిళా భద్రతా విభాగానికి చెందిన యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఎహెచ్‌టియు) ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తోందని తెలిపారు.
ప్రతి ఒక్కరికీ సాధికారత, ఎవరినీ విస్మరించకూడదు అనే నినాదంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం ద్వారా 20 మంది ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులకు నాలుగు నెలల పాటు ప్రత్యేక రాత పరీక్షల శిక్షణతో పాటు హాస్టల్ వసతి కల్పిస్తున్నామన్నారు. పోలీస్ కమిషనర్ అభ్యర్థన మేరకు, శిక్షణ మరియు హాస్టల్ ఖర్చుల నిమిత్తం సంబంధిత శాఖ రూ. 3.50 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది.
ఈ ప్రారంభ కార్యక్రమంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఎంపికైన 20 మంది అభ్యర్థులకు భారతదేశ చరిత్ర, తెలంగాణ చరిత్ర, అంకగణితం మరియు రీజనింగ్, భూగోళశాస్త్రం, ప్రస్తుత వ్యవహారాలు మరియు ఆర్థికశాస్త్రం వంటి అంశాలకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. అభ్యర్థులకు అవసరమైన వసతి సౌకర్యంతో పాటు క్రమం తప్పకుండా శిక్షణ అందిస్తామని, వారి పురోగతిని ఏహెచ్‌టీయూ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అంకితభావం, క్రమశిక్షణ మరియు ఏకాగ్రతతో కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తులో అభ్యర్థులందరూ ప్రభుత్వ ఉద్యోగ నియామక ఉత్తర్వులు పొంది, గర్వించదగిన పోలీస్ కుటుంబంలో సభ్యులుగా చేరుతారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. శిక్షణ మరియు వసతి సౌకర్యాల కల్పన కోసం ఏహెచ్‌టీయూ మరియు మహిళా భద్రతా విభాగం అధికారులు దిల్‌సుఖ్‌నగర్‌లోని యూనిక్ కోచింగ్ సెంటర్ మరియు కల్పన హాస్టల్‌తో సమన్వయం చేసుకున్నారు. అభ్యర్థులు, ఏహెచ్‌టీయూ అధికారులు, సంబంధిత శాఖ ప్రతినిధులు, కోచింగ్ సిబ్బంది మరియు హాస్టల్ యాజమాన్యంతో కూడిన ప్రత్యేక వాట్సాప్ సమన్వయ గ్రూపును ఏర్పాటు చేశారు. దీని ద్వారా అభ్యర్థుల పురోగతిని పర్యవేక్షించడంతో పాటు వారికి నిరంతర సహాయ సహకారాలు అందించనున్నారు.అలాగే, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ అసిస్టెంట్లు కోచింగ్ మరియు శారీరక దారుఢ్య శిక్షణకు హాజరయ్యేందుకు వీలుగా, శాఖా నిబంధనలకు లోబడి వారి విధుల్లో తగిన మార్పులు చేసేందుకు మహిళా భద్రతా విభాగం చర్యలు తీసుకోనుంది.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల
ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్









ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 05
ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో నూతనంగా నిర్మించిన వంటగది, భోజనశాల పరిశీలించి, విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారంతో పాటు నాణ్యమైన విద్యా బోధన అందించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎం.పి.సి. విద్యార్థినులకు గణితంలో అందిస్తున్న బోధన, వారి అభ్యసన స్థాయిని పరిశీలించి పలు సూచనలు చేశారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, అధికారులతో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాలలో ప్రభుత్వ భూముల పరిరక్షణ అంశాలను పరిశీలించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా నిరంతరం పర్యవేక్షించాలని, ఆక్రమణలు గుర్తించినట్లయితే వెంటనే స్పందించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.
పట్టణంలోని కృష్ణా మందిర్ రోడ్డు నం.2 లో ధనలక్ష్మి ట్రేడర్ వారు ఏర్పాటు చేసిన బియ్యం అమ్మకాల అవుట్ లెట్ ను జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, మండల తహసిల్దార్ కృష్ణ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్ లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని, తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన బి.పి.టి. న్యూ రైస్ బ్యాగ్ ను 1 వేయి 430 రూపాయలు, స్టీమ్ రైస్ ను 1 వేయి 560 రూపాయలు, హెచ్.ఎం.టి. స్టీమ్ రకం బియ్యం బస్తా 1 వేయి 898 రూపాయల చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. జిల్లాలోని మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ప్రాంతాలలో ప్రత్యేక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, భీమారం, లక్షెట్టి పేట ప్రాంతాలలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మార్కెట్ ధరలతో పాటు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కటే తక్కువ ధరకు నాణ్యమైన బియ్యాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు విద్యుత్, త్రాగునీరు, సాగునీటి వినియోగంలో పొదుపు పాటించాలని తెలిపారు. రైతులు తక్కువ నీటి అవసరం ఉన్న జొన్న, మొక్కజొన్న, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలలో నీటి వృధాను అరికట్టాలని, విద్యుత్ ను పొదుపుగా వినియోగించాలని, అవసరంలేని సమయంలో ఫ్యాన్లు, లైట్లు ఆపివేయాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 11 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించడం జరిగిందని, నేలను తేమ శాతం, పంటలపై ప్రభావం, లోటు వర్షపాతం అంశాలను ప్రామాణికంగా తీసుకొని శాస్త్రీయంగా అంచనా వేయడం జరిగిందని తెలిపారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. తాండూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ తో కలిసి సందర్శించి ప్రభుత్వ భూముల పరిరక్షణపై అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమించినట్లయితే క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆక్రమణదారులకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయాలని, ప్రభుత్వ భూములను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూభారతి దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ నాయబ్ తహసీల్దార్ కల్పన, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సర్వే దరఖాస్తులను
త్వరితగతిన పరిష్కరించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరోనవంబర్ 5,:
పెండింగ్ సర్వే దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే, సబ్ కలెక్టర్ కార్యాలయం ఎ.ఓ., అన్ని మండలాల తహసిల్దార్లు, అధికారులు, సంబంధిత సెక్షన్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సర్వే దరఖాస్తులు, సర్వే పనుల పురోగతి, జి.ఓ. నం. 76, 59 అమలు తీరు, ఎస్ఐఆర్ ప్రక్రియ, భూ భారతి, భూదాన్ భూములకు సంబంధించిన ఫైళ్లు, కోర్టు కేసులపై సమీక్షించారు. ఆయా అంశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా ప్రతి పనిని పూర్తి చేయాలని, ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశించిన సమయంలోగా అన్ని పనులు పూర్తి చేయాలని తెలిపారు.
ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లి నిలయం పై
ప్రత్యేక కథనం

శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం, బాసర

స్థలం: గోదావరి నది ఒడ్డున, నిర్మల్ జిల్లా, తెలంగాణ. హైదరాబాద్ నుంచి 205 కి.మీ.





ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ డైరీ) నవంబర్ 05
భారతదేశంలో సరస్వతీ దేవికి ఉన్న ఆలయాలు చాలా తక్కువ. అందులో ప్రసిద్ధమైనవి కేవలం రెండే. ఒకటి కాశ్మీర్ లోని శారదా పీఠం, రెండోది మన తెలంగాణలోని బాసర. దక్షిణ భారతదేశంలో సరస్వతికి ఉన్న ఏకైక పెద్ద ఆలయం ఇదే.
1. గుడి ఎలా ఏర్పడింది? – స్థల పురాణం
ఇది మహాభారత కాలం నాటి కథ
కురుక్షేత్ర యుద్ధం అయిపోయిన తర్వాత, వేదవ్యాస మహర్షికి మనశ్శాంతి లేకుండా పోయింది.
ప్రశాంతత కోసం దక్షిణ దిక్కుగా బయలుదేరి దండకారణ్యంలోకి వచ్చాడు.
గోదావరి ఒడ్డున ఉన్న కుమారచల కొండల దగ్గర ఆగిపోయాడు. ఆ ప్రదేశం ఎంతో ప్రశాంతంగా అనిపించి అక్కడే ఒక గుహలో తపస్సు మొదలుపెట్టాడు. అందుకే ఆ ప్రాంతాన్ని తపోభూమి అంటారు.ఒక రోజు తపస్సులో ఉండగా జగన్మాత కలలో కనిపించి ఇలా చెప్పిందంట:
ం “వ్యాసా! రోజూ గోదావరిలో స్నానం చేసి, అక్కడ నుంచి మూడు గుప్పెళ్ల ఇసుక తెచ్చి ఇక్కడ మూడు కుప్పలుగా పోసి పూజించు.”
వ్యాసుడు అలాగే చేశాడు. కొన్ని రోజులకు ఆ మూడు ఇసుక కుప్పల నుంచి ముగ్గురు అమ్మవార్లు ఉద్భవించారట.
1. మహా సరస్వతి – విద్యకు అధిదేవత
2. మహా లక్ష్మి – ధనానికి అధిదేవత
3. మహా కాళి – శక్తికి అధిదేవత
వ్యాసుడు వాటికి ప్రాణ ప్రతిష్ట చేశాడు. వ్యాసుడు చేసినవి. వేల ఏళ్లు అయినా ఇప్పటికీ చెక్కుచెదరలేదు అనేది అతి పెద్ద విశేషం.
– పసుపు అలంకరణ: విగ్రహాలకు రోజూ పసుపు పూసి అలంకరిస్తారు. ఆ పసుపునే భక్తులకు బండారా అని ప్రసాదంగా ఇస్తారు. దాన్ని తింటే జ్ఞానం పెరుగుతుందని నమ్మకం.
– ముగ్గురమ్మల దర్శనం: ఒకే గర్భగుడిలో సరస్వతి, లక్ష్మి, కాళి ముగ్గురూ కలిసి ఉండటం ఇక్కడ మాత్రమే చూస్తాం. అంటే విద్య, ధనం, శక్తి – మూడూ ఒకే చోట.
– సంగీత స్తంభం: గుడిలో ఒక స్తంభానికి చెవి ఆనిస్తే సంగీతంలోని సప్తస్వరాలు వినిపిస్తాయని చెబుతారు.
– 8 పుష్కరిణిలు: ఊరిలో ఇంద్ర, సూర్య, వ్యాస, వాల్మీకి, విష్ణు, గణేశ, పుత్ర, శివ అనే 8 తీర్థాలు ఉన్నాయి.
3. చరిత్ర పరంగా
చరిత్రకారుల ప్రకారం, 6వ శతాబ్దంలో నందగిరి రాజు బిజియలుడు ఈ గుడిని కట్టించాడు. తర్వాత చాళుక్యులు, కాకతీయులు, రాష్ట్రకూటులు అభివృద్ధి చేశారు. 17వ శతాబ్దంలో దాడుల వల్ల పాడైతే, మళ్ళీ పునరుద్ధరించారు.
4. ఎందుకు అంత ప్రాముఖ్యత?
బాసర అంటేనే అక్షరాభ్యాసం.
తల్లిదండ్రులు తమ పిల్లలకు మొదటి అక్షరాన్ని ఇక్కడే దిద్దిస్తారు. పిల్లవాడు అమ్మవారి ముందు పలకపై “ఓం నమః శివాయ, సరస్వత్యై నమః” అని రాస్తాడు. ఇక్కడ మొదలుపెడితే చదువు బాగా వస్తుందని కోట్ల మంది నమ్మకం.
అందుకే వసంత పంచమి, దసరా, నవరాత్రులకు ఇక్కడ లక్షల మంది జనం పోటెత్తుతారు. స్టూడెంట్స్ పరీక్షల ముందు, ఉద్యోగాల కోసం, కళాకారులు తమ విద్య కోసం ఇక్కడికి వస్తారు.

ఎక్కువ కాలం ఉన్నాడు కాబట్టి ఆ ఊరికి మొదట వ్యాసపురి అని, తర్వాత వాసర అని, మరాఠీ ప్రభావంతో బాసర అని పేరు వచ్చింది.
మరో కథ ప్రకారం, వాల్మీకి మహర్షి కూడా ఇక్కడే సరస్వతిని ప్రతిష్టించి, ఆమె ఆశీర్వాదంతోనే రామాయణం రాశాడట. అందుకే గుడి పక్కనే వాల్మీకి సమాధి, పాలరాతి విగ్రహం కనిపిస్తాయి.
2. ఈ గుడి ప్రత్యేకత ఏమిటి?
అన్ని గుళ్లలా ఇది రాతి విగ్రహం కాదు అన్నయ్యా.
– ఇసుక విగ్రహాలు: అమ్మవారి విగ్రహాలు ఇసుకతో

పోలింగ్ సరళి లైవ్ లో వీక్షణ
-కలెక్టరేట్ నుంచి పరిశీలించిన కలెక్టర్ రాజాబాబు ఎన్నికల పరిశీలకులు చక్రధర బాబు



ఒంగోలు,ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ప్రకాశం జిల్లా వ్యాప్తంగా ఎంపిటిసి, జెడ్పిటిసి పోలింగ్ ప్రక్రియ అత్యంత ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది. ప్రకాశం భవనం నుంచి జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జిల్లా ఎన్నికల పరిశీలకులు కె.వి.ఎన్. చక్రధర బాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి లైవ్ వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రత్యక్షంగా వీక్షించారు. ?పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల క్యూ లైన్లు, భద్రతా ఏర్పాట్లు మరియు పోలింగ్ సిబ్బంది పని తీరును వారు పరిశీలించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసామన్నారు. కంట్రోల్ రూమ్‌లో విధుల్లో ఉన్న సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, ఎలాంటి సమస్య తలెత్తినా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ చెప్పారు.

స్ట్రాంగ్ రూముల వద్ద
పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేయాలి
-రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూముల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
జిల్లా కలెక్టర్ పి రాజబాబు, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ హర్షవర్ధన్ రాజుతో కలిసి గురువారం సాయంత్రం స్థానిక క్వీన్స్ కాలేజీ మరియు రైజ్ కాలేజీలలో పర్యటించి రిసెప్షన్ సెంటర్లు మరియు స్ట్రాంగ్ రూముల ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ క్వీన్స్ కాలేజీలో దర్శి, అద్దంకి మరియు ఒంగోలు నియోజకవర్గాలకు సంబంధించి 12 మండలాలు, రైజ్ కాలేజీలో కొండేపి కందుకూరు సంతనూతలపాడు నియోజకవర్గాలకు సంబంధించి 12 మండలాలకు సంబంధించిన బ్యాలెట్ పేపర్ల బాక్సులను భద్రపరచనున్నారు.కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ బ్యాలెట్ బాక్స్ లను ఇతర డ్యామేజ్ జరగకుండా ఆయా స్ట్రాంగ్ రూములలో చేర్చే విధంగా రక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. బందోబస్తును సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ట్రాఫిక్ సమస్యలు రాకుండా క్రమ పద్ధతిలో బస్సులు గమ్యస్థానం చేరే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ సంబంధిత సిబ్బందికి సూచించారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, కందుకూరు సబ్ కలెక్టర్ హిమ వంశీ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చిరంజీవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారంటూ ఈసీకి టీడీపీ ఎమ్మెల్యేలు ఫిర్యాదు

-స్థానిక ఎన్నికల్లో వైసీపీ నేతల దౌర్జన్యాలపై ఎస్ఈసీకి టీడీపీ ఫిర్యాదు

-ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో వినతిపత్రం

-పులివెందులలో పెట్రోల్ బాంబులతో ఓటర్లను భయపెట్టారని ఆరోపణ

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా అధికార వైసీపీ నేతలు దౌర్జన్యాలకు, అక్రమాలకు పాల్పడుతున్నారని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. ఈ మేరకు టీడీపీ ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రక్రియను అడ్డుకుంటున్న వైసీపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పులివెందుల, సంతనూతలపాడు, సత్తెనపల్లి, చీరాల, చంద్రగిరి నియోజకవర్గాల్లో వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యంగా కడప జిల్లా పులివెందులలో పెట్రోల్ బాంబులతో దాడులు చేస్తూ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఎస్ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ఇలాంటి ఘటనలపై తక్షణం స్పందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.
పెనుగలూరులో పెట్రోల్ బాంబుల దాడి జరిగిందన్న వార్తలను ఖండించిన తిరుపతి ఎస్పీ
మరోవైపు, తిరుపతి జిల్లా పెనుగలూరులో పెట్రోల్ బాంబుల దాడి జరిగిందన్న వార్తలను తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఖండించారు. జిల్లాలో చిన్నపాటి ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు

బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి హౌస్ అరెస్ట్.. శబరిని ఎందుకు వదిలేశారంటూ వైసీపీ ప్రశ్న

-ఓటు వేయడానికి వెళ్లిన బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి గృహ నిర్బంధం
-కూటమి ప్రభుత్వం కుట్ర పూరితంగా అరెస్టులు చేస్తోందన్న వైసీపీ
-రిగ్గింగ్ కోసమే మండలాల్లో ముఖ్య నేతల అరెస్ట్ అని ఆరోపణ



నంద్యాల,జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
నంద్యాల జిల్లాలో రాజకీయ ఉద్రిక్తత చోటు చేసుకుంది. పరిషత్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు తన సొంత గ్రామమైన పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రికి వెళ్లిన వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డిని పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ పరిణామంపై వైసీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.ఈ నేపథ్యంలో నందికొట్కూరు వైసీపీ కార్యాలయంలో పార్టీ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. కేవలం ఓటు వేయడానికి వెళ్లిన తమ నాయకుడిని హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గమని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన మండిపడ్డారు. కూటమి నాయకులు యథేచ్ఛగా రిగ్గింగ్ చేసుకోవాలనే దురుద్దేశంతోనే ప్రతి మండలంలో 5 నుంచి 10 మంది వైసీపీ ముఖ్య నాయకులను అరెస్ట్ చేస్తున్నారని ఆరోపించారు.ఎంపీ బైరెడ్డి శబరిని ఎందుకు వదిలేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ అక్రమంగా అరెస్ట్ చేసిన నాయకులను తక్షణమే విడుదల చేసి, వారి గ్రామాలకు పంపకపోతే జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని సుధీర్ హెచ్చరించారు. ముచ్చుమర్రిలో సిద్ధార్థ్ రెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు, అక్కడే ఉన్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిని ఎందుకు వదిలేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అప్రజాస్వామిక చర్యలకు కూటమి ప్రభుత్వం వడ్డీతో మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు

క్రీడలు మానసిక ఉల్లాసం... ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, జెడ్సీ రాధికాగుప్త..





నాగారం, నవంబర్ 5:- (జర్నలిస్ట్ డైరీ)
చిల్కానగర్ డివిజన్లోని షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మునిసిపల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాలు ప్రారంభించారు. చిల్కానగర్ డివిజన్లోని ఉప్పల్ షటిల్ బ్యాట్మింటన్ కోర్టును ప్రారంభించిన అనంతరం ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి, జోనల్ కమిషనర్ రాధిక గుప్తాలు మాట్లాడారు. ఉప్పల్ ఇండోర్ బ్యాట్మింటన్ షటిల్ కోర్టు గత ఎనిమిది సంవత్సరాల కింద నిర్మించడం జరిగిందని ఇప్పుడు దానికి సుమారు 45 లక్షల రూపాయలు వెచ్చించి రెన్యువేషన్ పనులు చేయడం జరిగిందని వాటిలో స్టేడియం వుడెన్ ఫ్లోర్ రిపేర్లు ,లోపల బయట పెయింటింగ్, ఫ్లోర్ మ్యాట్స్, విండోస్, ఎగ్జాస్ట్ ఫ్యాన్స్, చైర్స్, లాకర్స్, అన్నీ కూడా కొత్తవి ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. క్రీడాకారులకు ఈరోజు నుంచి స్టేడియం ని ఓపెన్ చేసి ఆడుకోవడానికి వెసులుబాటు కల్పిస్తామని అన్నారు. అదేవిధంగా ఉప్పల్ నియోజకవర్గంలో అన్ని ఆట స్థలాలు, మైదానాలు పార్కులు ఓపెన్ జిమ్ములు లాంటి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఇవన్నీ కూడా వారికి అందుబాటులోకి తేవాలని అనునిత్యం ప్రజలకు అత్యంత అవసరమైన పనులన్నిటిని కూడా చేపియడం జరుగుతుందని దీనికి, పైన వివరించిన పనులన్నిటికీ నిధులకు సహకరిస్తున్నటువంటి ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డికి మరి అదే విధంగా జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఉప్పల్ ఎం ఎం సి అధికారులు, షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు మరియు ప్లేయర్స్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొత్తపట్నం తీరానికి కొట్టుకొచ్చిన ముగ్గురు తమిళ మత్స్యకారుల మృతదేహాలు

-సముద్రంలో గల్లంతైన మరో ఆరుగురు మత్స్యకారులు

-తుఫాను ప్రభావంతో ప్రమాదానికి గురైన బోటు.. -సముద్రంలో మునక

-ఘటనపై తమిళనాడు అధికారులతో మాట్లాడిన

జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు





కొత్తపట్నం, ఒంగోలు,ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ:
తుఫాను ప్రభావంతో సముద్రంలో ప్రమాదానికి గురైన తమిళనాడుకు చెందిన మత్స్యకారుల బోటు కొత్తపట్నం తీర ప్రాంతానికి కొట్టుకు రావడంతో కలకలం రేగింది. ఈ ఘటనలో సముద్రంలో గల్లంతైన తొమ్మిది మంది మత్స్యకారుల్లో ముగ్గురి మృతదేహాలు సముద్ర తీరానికి కొట్టుకొచ్చాయి. మిగిలిన ఆరుగురి ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉంది.
మృతదేహాలను పరిశీలించిన కలెక్టర్..
గురువారం కొత్తపట్నం సముద్ర తీరాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, తీరానికి కొట్టుకొచ్చిన బోటుతో పాటు ముగ్గురు మత్స్యకారుల మృతదేహాలను పరిశీలించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.
తుఫాను ప్రభావంతో సముద్రంలో ప్రమాదం
గత నెల 29వ తేదీన తమిళనాడు నుంచి మూడు బృందాలు మూడు బోట్లలో చేపల వేటకు బయలుదేరాయని కలెక్టర్ తెలిపారు. తుఫాను ప్రభావంతో రెండు బోట్లు రామాయపట్నం సమీపంలో రక్షణ కోసం లంగరు వేసి నిలిచిపోయాయని, మరో బోటు నిజాంపట్నం వైపు వెళ్లిందని వివరించారు.నిజాంపట్నం వెళ్లిన బోటులోని మత్స్యకారులు రామాయపట్నం వద్ద ఉన్న తమ బృందాన్ని కలుసుకోవాలనే ఉద్దేశంతో తగిన అనుమతులు లేకుండానే తిరుగు ప్రయాణం ప్రారంభించారని తెలిపారు. అయితే సముద్రంలో తుఫాను ప్రభావంతో విపరీతమైన గాలులు వీయడంతో బోటు ప్రమాదానికి గురై కొట్టుకు పోయిందని చెప్పారు.
తొమ్మిది మందిలో ముగ్గురి మృతదేహాలు లభ్యం
ప్రాథమిక సమాచారం ప్రకారం ప్రమాదానికి గురైన బోటు కృష్ణపట్నం సముద్ర తీరానికి సుమారు ఒకటిన్నర నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో మునిగిపోయినట్లు కలెక్టర్ వెల్లడించారు. బోటులో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది మత్స్యకారుల్లో ముగ్గురి మృతదేహాలు సముద్ర తీరానికి కొట్టుకొచ్చాయని, మిగిలిన ఆరుగురి ఆచూకీ ఇంకా తెలియలేదని తెలిపారు.
తమిళనాడు అధికారులతో సంప్రదింపులు
మత్స్యకారుల ప్రమాదానికి సంబంధించి తమిళనాడు అధికారులతో మాట్లాడినట్లు కలెక్టర్ తెలిపారు. అక్కడి సంబంధిత అధికారులు కొత్తపట్నం ప్రాంతానికి బయలుదేరి వస్తున్నారని, వారు వచ్చిన అనంతరం తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. ప్రమాదానికి గురైన బోటును సముద్రం నుంచి ఒడ్డుకు తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడతామని వెల్లడించారు.ఈ పర్యటనలో రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రశేఖర్ నాయుడు, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, వివిధ

ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల పోలింగ్ తీరును పరిశీలించిన జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి





కొత్తపట్నం,ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
కొత్తపట్నం మండలంలో జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పిటిసి పోలింగ్ ప్రక్రియను జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని అత్యంత కీలకమైన అల్లూరు గ్రామ పోలింగ్ కేంద్రాలు 5, 6, 7, 8 లతో పాటు, పల్లెపాలెం గ్రామ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు 21, 22, 23, 24 లను ఆమె ప్రత్యక్షంగా సందర్శించి ఓటింగ్ సరళిని సమీక్షించారు. ఓటర్ల గుర్తింపు ప్రక్రియతో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద పారదర్శకత కోసం ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ నిర్వహణ తీరును తనిఖీ చేసి, అధికారుల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ అధికారులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్లందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన వాతావరణాన్ని కల్పించడమే తమ ప్రాథమిక లక్ష్యమని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలను నూరు శాతం ఖచ్చితత్వంతో అమలు చేయాలని, పోలింగ్ కేంద్రాలకు వచ్చే వయో వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు మరియు చంటిపిల్లల తల్లులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రిసైడింగ్ అధికారులు మరియు సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ, ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశిస్తూ, రాజకీయ పార్టీల ఏజెంట్లు కూడా నిబంధనలకు లోబడి అధికారులకు పూర్తి సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్ కోరారు.

క్యూలైన్లో నిలబడి ఓటు వేసిన హోం మంత్రి అనిత

-పరిషత్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న హోం మంత్రి అనిత

-అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో కుటుంబసభ్యులతో కలిసి ఓటు

వేసిన వైనం

-ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు



అనకాపల్లి,అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పరిషత్ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలోని ఒక పోలింగ్ కేంద్రంలో ఆమె ఓటు వేశారు. మంత్రిగా ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు లేకుండా, ఒక సామాన్య పౌరురాలిగా తన కుటుంబసభ్యులతో కలిసి క్యూలైన్‌లో నిలబడటం అందరి దృష్టిని ఆకర్షించింది. తన వంతు వచ్చేవరకు అందరితో పాటు వేచి ఉండి ఆమె ఓటు వేశారు. పాయకరావుపేట నియోజకవర్గానికి ఆమె ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తుండగా, నక్కపల్లి మండలం ఆ నియోజకవర్గం పరిధిలోకే వస్తుంది.ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి”
ఓటు వేసిన అనంతరం మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. “ప్రజాస్వామ్యంలో ఓటు చాలా కీలకం. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి” అని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనడం ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

ఓటు వేయని జగన్‌కు ఎన్నికలపై మాట్లాడే నైతిక హక్కు లేదు...పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర

-ప్రజా తీర్పును గౌరవించడంలో జగన్ డీఎన్ఏలోనే లేదన్న నరేంద్ర

-అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలు గొప్ప.. ఇప్పుడు దౌర్జన్యమా అని ప్రశ్న

-అసెంబ్లీ, స్థానిక ఎన్నికల ఓటమిని జీర్ణించుకోలేకే వైసీపీ ఆరోపణలు



అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
కూటమి ప్రభుత్వంపై బురద చల్లడం మానుకోవాలని హితవుఓటు హక్కు వినియోగించుకోని జగన్ కు ఎన్నికల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తీవ్రంగా విమర్శించారు. ప్రజా తీర్పును గౌరవించడం జగన్ డీఎన్ఏలోనే లేదని, ఆయన మాటల్లో ఆత్మస్తుతి, పరనింద తప్ప మరేమీ కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జగన్ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా బదులిచ్చారు.
ఓటు వేయకుండా వెనక్కి వచ్చిన ఏకైక రాజకీయ నాయకుడు జగన్.
"ప్రజాస్వామ్యంలో ఓటు అనేది అత్యంత పవిత్రమైనది. పేదవాడి నుంచి రాష్ట్రపతి వరకు అందరికీ ఓటు ఉంటుంది. కానీ, బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో వచ్చి, పోలింగ్ బూత్ దగ్గరకు వెళ్లి ఓటు వేయకుండా వెనక్కి వచ్చిన ఏకైక రాజకీయ నాయకుడు జగన్. ఇది ప్రజాస్వామ్యం పట్ల, ప్రజల ఓటు పట్ల ఆయనకు ఉన్న చిన్నచూపును స్పష్టం చేస్తోంది. ఓటు వేయని నాయకుడిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారు" అని ధూళిపాళ్ల అన్నారు.
స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఓటమి తర్వాత అదే పంథా
2024 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును గౌరవించకుండా, ఈవీఎంల వల్లే కూటమి గెలిచిందని జగన్ ప్రచారం చేశారని, ఇప్పుడు బ్యాలెట్ పద్ధతిలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఓటమి తర్వాత అదే పంథాను అనుసరిస్తున్నారని విమర్శించారు. "అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలు జరిగితే అద్భుతం అన్నారు. ఇప్పుడు అదే జరిగితే దౌర్జన్యం అంటున్నారు. ఇది ద్వంద్వ నీతి కాదా?" అని ఆయన ప్రశ్నించారు.
వారి హయాంలో స్టేట్ ఎలక్షన్ కమిషన్‌ను నిర్వీర్యం చేశారని, నాటి కమిషనర్ ప్రాణభయంతో కేంద్రానికి లేఖ రాసిన విషయాన్ని జగన్ గుర్తుంచుకోవాలని హితవు పలికారు.వాస్తవాలను కప్పిపుచ్చి ప్రభుత్వంపై ఆరోపణలుప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ భారీ సంఖ్యలో నామినేషన్లు వేసిందని, వాస్తవాలను కప్పిపుచ్చి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తోందని నరేంద్ర కుమార్ అన్నారు. "ఎంపీటీసీ స్థానాల్లో 17,726, జెడ్పీటీసీల్లో 1,445, కార్పొరేషన్లలో 367 చోట్ల మీ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. పోలీసులే మీకు రక్షణగా ఉండి నామినేషన్లు వేయించారు. నిజంగా ప్రభుత్వం రిగ్గింగ్ చేసి ఉంటే, మీ పార్టీకి చెందిన ఒక మేయర్ సహా నలుగురు అభ్యర్థులు ఎలా గెలిచారు?" అని నిలదీశారు.
వైసీపీ నమ్ముకున్నది విధ్వంసాన్ని. మేము నమ్ముకున్నది ప్రజలను
ఎన్నికలను అడ్డుకోవడానికి డీలిమిటేషన్, బీసీ రిజర్వేషన్లపై వైసీపీ 61 కేసులు వేసిందని, అయినా సుప్రీంకోర్టు ప్రజాక్షేత్రంలో తేల్చుకోమని చెప్పడంతో ఎన్నికలు పారదర్శకంగా జరిగాయని వివరించారు. "వైసీపీ నమ్ముకున్నది విధ్వంసాన్ని. మేము నమ్ముకున్నది ప్రజలను, అభివృద్ధిని, సంక్షేమాన్ని. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేసిన పనులను చూసే ప్రజలు స్థానిక ఎన్నికల్లోనూ వైసీపీని నాలుగు స్థానాలకే పరిమితం చేశారు" అని తెలిపారు.
2024లో ప్రజలిచ్చిన షాక్ ట్రీట్‌మెంట్‌ను మరోసారి స్థానిక ఎన్నికల్లో ఇచ్చారని, ఓటమిని జీర్ణించుకోలేక వైసీపీ నేతలు నిరాశతో మాట్లాడుతున్నారని అన్నారు.
అసెంబ్లీకి రాకుండా ప్రభుత్వంపై బురద చల్లి వెళ్లే ధోరణిని జగన్ మానుకోవాలి
అసెంబ్లీకి రాకుండా, అప్పుడప్పుడు వచ్చి ప్రభుత్వంపై బురద చల్లి వెళ్లే ధోరణిని జగన్ మానుకోవాలని ధూళిపాళ్ల సూచించారు. ప్రజా తీర్పును గౌరవించి, ప్రజా సమస్యలపై పోరాడాలని, అనవసరమైన ఆరోపణలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయవద్దని ఆయన హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు

ఎన్నికల విధుల్లో టీచర్ మృతి.. చంద్రబాబు, నారా లోకేశ్ తీవ్ర విచారం

-అనంతపురం జిల్లాలో ఎన్నికల విధుల్లో విషాదం

-అస్వస్థతకు గురై పోలింగ్ అధికారిణి హరిత మృతి

-కదిరదరకుంట పోలింగ్ కేంద్రంలో ఘటన

-కుటుంబానికి అండగా ఉంటామని సీఎం చంద్రబాబు హామీ

-ప్రగాఢ సానుభూతి తెలియజేసిన విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్



అనంతపురం, అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఆంధ్రప్రదేశ్‌లో నేడు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల విధుల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అనంతపురం జిల్లాలో పోలింగ్ అధికారిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఓ ఉపాధ్యాయురాలు అకస్మాత్తుగా మరణించారు. ఈ ఘటన గురువారం కూడేరు మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళితే, కూడేరు మండలం కాడదారకుంట గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా (ఏపీఓ) హరిత గౌడ్ (58) విధుల్లో ఉన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ జరుగుతుండగా ఆమె తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతూ పోలింగ్ కేంద్రంలోనే కుప్పకూలిపోయారు. వెంటనే అప్రమత్తమైన అక్కడి వైద్య సిబ్బంది ఆమెను కుడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. గుండెపోటు రావడంతో మధ్యాహ్నం సుమారు 12:50 గంటలకు ఆమె తుదిశ్వాస విడిచినట్లు అధికారులు తెలిపారు.
మృతురాలు డి.హిరేహాళ్ మండలం పూలకుర్తి గ్రామంలో ఎంపీయూపీ పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ మృతురాలు హరిత, డి.హిరేహాళ్ మండలం పూలకుర్తి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా (ఎస్జీటీ) పనిచేస్తున్నారు. ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయురాలు మరణించడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.
ముఖ్యమంత్రి చంద్రబాబు,లోకేశ్‌తీవ్ర దిగ్భ్రాంతి
ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హరిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. "అనంతపురం జిల్లా కూడేరు మండలం కాడదారకుంటలో ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న టీచర్ హరిత గౌడ్ గారు గుండెపోటుతో కన్నుమూయడం చాలా బాధాకరం. అస్వస్థతకు గురైన వెంటనే అత్యవసర వైద్యం అందించినా ఫలితం లేక మృతి చెందడం ఈ విషాదం నెలకొంది. వారికి నివాళులు అర్పిస్తున్నాను. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అంటూ సోషల్ మీడియాలో స్పందించారు

పులివెందులలో ఉద్రిక్తత.. రాళ్లు, సీసాలతో దాడులు.. ఒకరికి గాయాలు

-పులివెందులలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వేళ తీవ్ర ఉద్రిక్తత

-ఆర్. తుమ్మలపల్లిలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ, రాళ్ల దాడి

-దాడిలో వైసీపీ కార్యకర్త కృష్ణారెడ్డికి తీవ్ర గాయాలు

-పార్నపల్లెలో ఏజెంట్ల వివాదం, ఎంపీ అవినాష్ రెడ్డిని అడ్డుకున్న పోలీసులు

-పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఇరువర్గాల మధ్య తోపులాటలు

పులివెందుల,జర్నలిస్ట్ డైరీ :
వైఎస్ఆర్ కడప జిల్లాలోని పులివెందుల నియోజకవర్గంలో మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పలు గ్రామాల్లో అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ వర్గాల మధ్య తీవ్ర ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలతో పులివెందుల పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.
పులివెందుల మండలంలోని ఆర్. తుమ్మలపల్లి గ్రామంలో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య మొదలైన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో జరిగిన రాళ్ల దాడిలో కృష్ణారెడ్డి అనే వైసీపీ కార్యకర్త తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో గ్రామంలో ఒక్కసారిగా టెన్షన్ పెరిగింది.ఇదిలా ఉండగా, లింగాల మండలం పార్నపల్లెలో పోలింగ్ ఏజెంట్ల విషయంలో వివాదం చెలరేగింది. తమ ఏజెంట్లను కేంద్రంలోకి అనుమతించడం లేదని వైసీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకొని అక్కడికి వెళ్తున్న ఎంపీ అవినాష్ రెడ్డిని పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. మరోవైపు, పెద్దముడియం మండలం గుండ్లకుంటలో వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, టీడీపీ ఏజెంట్లను బయటకు పంపించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఎర్రిపల్లిలో పోలీసులు ఓటర్లను అడ్డుకుంటున్నారంటూ ఎర్రిపల్లిలో పోలీసులు ఓటర్లను అడ్డుకుంటున్నారంటూ ఆరోపణలు రావడంతో అక్కడ కూడా కొంతసేపు ఉద్రిక్తత కనిపించింది. వరుస ఘటనల నేపథ్యంలో పులివెందుల నియోజకవర్గంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, పరిస్థితిని సమీక్షిస్తున్నారు

కొత్తపట్నం తీరంలో తమిళనాడు బోటులో మృతదేహాలు కొట్టుకొచ్చిన ఘటనపై మంత్రి డా.స్వామి సంతాపం

ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ప్రకాశం జిల్లా కొత్తపట్నం తీరంలో తమిళనాడుకు చెందిన బోటులో నలుగురు మృత దేహాలు కొట్టుకొచ్చిన ఘటనపై మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి స్పందించారు.గురువారం జిల్లా అధికారులతో కలసి తమిళనాడు ప్రభుత్వంతో మంత్రి స్వామి సంప్రదింపులు జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ....బోటులో ఇంకెవరైనా ఉన్నారన్న దానిపై అవసరమైతే రెస్యూ ఆపరేషన్ జరుపుతామన్నారు. ఈ ఘటన బాధాకరమని, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్టు మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు.

కొండముడుసుపాలెంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

-ఓటింగ్ సరళి, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష..



కందుకూరు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ:
ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కందుకూరు డివిజన్ పరిధిలోని కొండముడుసుపాలెం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన 27వ నంబర్ పోలింగ్ స్టేషన్‌తో పాటు, అంకమ్మ దేవాలయం ప్రాంగణంలోని ఎలిమెంటరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన 26వ నంబర్ పోలింగ్ స్టేషన్‌ను సబ్ కలెక్టర్ హిమవంశీతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారా అని ఆరా తీశారు. పోలింగ్ అధికారులు (పీఓలు), సహాయ పోలింగ్ అధికారులు (ఏపీఓలు) కేటాయించిన విధులు, సీట్ల ఏర్పాట్లను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పూర్తి నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పటిష్టమైన బందోబస్తు కొనసాగించాలని ఆదేశించారు.అనంతరం రాజకీయ పార్టీల ఏజెంట్లతో మాట్లాడి వారి వివరాలను తెలుసుకోవడంతో పాటు, ఇప్పటివరకు నమోదైన పోలింగ్ శాతంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి మురళి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జడ్పిటిసి, ఎంపిటిసి కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన మార్కాపురం జిల్లా ఎస్పీ

-ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలి
-జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా



మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
నవంబర్ 7వ తేదీన నిర్వహించనున్న జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మార్కాపురం మార్కెట్ యార్డులో, కంభం జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా, సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో సమీక్షించారు.కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, ప్రవేశ ద్వారాలు, బారికేడింగ్, తనిఖీ ఏర్పాట్లను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత, నిరంతర పోలీస్ పహారా, సీసీటీవీ పర్యవేక్షణ ఏర్పాట్లను సమీక్షించారు. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, జన సమూహాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

భూ దరఖాస్తుల పరిష్కారానికి కలెక్టర్ డెడ్‌లైన్

-భూ సమస్యల పరిష్కారంలో జాప్యం సహించేది లేదు
-నవంబర్ 15లోగా భూభారతి పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలి
-భూ రికార్డుల తారుమారుకు పాల్పడితే కఠిన చర్యలు
-భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ
-22 వేల భూభారతి దరఖాస్తులకు మోక్షం ఎప్పటిలోగా?
-భూ రీసర్వేలో పారదర్శకత పాటించాలి: కలెక్టర్ సి. నారాయణ రెడ్డి





రంగారెడ్డి, నవంబర్ 5 జర్నలిస్ట్ డైరీ :
జిల్లాలో భూ సంబంధిత సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూభారతి, జీవో 118, 59, యూఎల్‌సీ, 90-డి, 92 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి అదనపు కలెక్టర్లు డాక్టర్ కిరణ్మయి, చంద్రారెడ్డితో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భూభారతి, వివిధ ప్రభుత్వ ఉత్తర్వుల కింద నమోదైన భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కార పురోగతిని సమీక్షించారు. భూభారతి పోర్టల్‌లో సుమారు 22 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ నవంబర్ 15వ తేదీలోగా పరిష్కరించాలని ఆదేశించారు. జీవో 118 కింద ఉన్న దరఖాస్తులను వారం రోజుల్లోగా, జీవో 59, 92 కింద ఉన్న దరఖాస్తులను 15 రోజుల్లోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. యూఎల్‌సీకి సంబంధించి జీవో 455, 456, 740 కింద నమోదైన మాన్యువల్ దరఖాస్తులను సంబంధిత రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు.

భూ రీసర్వేలో పారదర్శకత తప్పనిసరి
జిల్లాలో భూ రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామసభలకు కనీసం వారం రోజుల ముందుగానే నోటీసులు జారీ చేయాలని సూచించారు. అటవీ, రోడ్లు భవనాలు, ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన భూముల వివరాలను సేకరించి, ఆయా శాఖల అధికారుల సమక్షంలో సరిహద్దులను నిర్ధారించాలన్నారు. సంబంధిత అధికారుల అభిప్రాయాలు, సంతకాలను రికార్డుల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. గ్రామసభల నిర్వహణలో నిర్దేశిత ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని (ఎస్ఓపీ) తప్పనిసరిగా పాటించాలని, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి హాజరయ్యేలా చూడాలని తెలిపారు. సమావేశాల వివరాలను అధికారిక రిజిస్టర్లలో నమోదు చేసి, పాల్గొన్న వారి సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. రీ-సర్వేకు సంబంధించిన 13 ఫార్మాట్లను సక్రమంగా నిర్వహిస్తూ, సర్వే బౌండరీస్ చట్టం--1923, తెలంగాణ భూభారతి చట్టం--2024 నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ప్రభుత్వ, రిజర్వ్‌డ్, ఇతర శాఖలకు చెందిన భూముల విషయంలో క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. నోటీసుల జారీ, భూముల సరిహద్దుల నిర్ధారణ, గ్రామసభల మినిట్స్ సహా అన్ని రికార్డులను పకడ్బందీగా భద్రపరచాలని ఆదేశించారు. తప్పుడు నివేదికలు సమర్పించడం, రికార్డులను తారుమారు చేయడం, నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడే అధికారులపై కఠినమైన శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ కిరణ్మయి, చంద్రారెడ్డి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రాంరెడ్డి, డీఆర్ఓ శారదాదేవి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లు, యూఎల్‌సీ విభాగం అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, గ్రామపాలన అధికారులు (GPO), సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభాత్ నగర్ పార్కును కాపాడుకుంటాం

-వాకర్లకు ఇబ్బంది కలిగించేలా గేటు ఏర్పాటు చేయొద్దు
-సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తా: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్, నవంబర్ 5 జర్నలిస్ట్ డైరీ :
ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తూ, వందలాది మంది వాకర్లకు ఉపయోగపడుతుందని చైతన్యపురి డివిజన్ పరిధిలోని ప్రభాత్ నగర్ పార్కును కాపాడేందుకు కృషి చేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. పార్కులో వాకింగ్‌కు ఇబ్బంది కలిగించేలా గేటు ఏర్పాటు చేయకుండా అవసరమైన చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులతో మాట్లాడతానని స్పష్టం చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం 5:30 గంటలకు ఎమ్మెల్యే ప్రభాత్ నగర్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో వాకింగ్ చేస్తున్న స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాకర్లు మాట్లాడుతూ.. తాము ఎన్నో సంవత్సరాలుగా ప్రతిరోజూ ఈ పార్కులో వాకింగ్ చేస్తున్నామని, వందలాది మంది స్థానికులు ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ పార్కుపైనే ఆధారపడి ఉన్నారని ఎమ్మెల్యేకు వివరించారు. అయితే సమీపంలో నిర్మాణంలో ఉన్న టీమ్స్ ఆసుపత్రి యాజమాన్యం పార్కు వద్ద గేటు ఏర్పాటు చేయనున్నట్లు తెలియడంతో ఆందోళన వ్యక్తం చేశారు. గేటు ఏర్పాటు చేస్తే వాకింగ్‌కు అందుబాటులో ఉన్న స్థలం తగ్గిపోతుందని, ఇప్పటికే ప్రజలు వినియోగిస్తున్న పార్కును రెండు భాగాలుగా విభజించడం సరికాదని తమ అభ్యంతరాలను వెల్లడించారు. వాకర్ల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో టీమ్స్ ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి ఆసుపత్రి ప్రాంగణంలో పోలీస్ స్టేషన్, చిల్డ్రన్స్ పార్క్, వాటర్ ట్యాంక్, సబ్‌స్టేషన్ తదితర అవసరాలకు స్థలం కేటాయించాలని కోరినట్లు తెలిపారు. దీనిపై అప్పటి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత జీవో జారీ చేయించారని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం మారిన అనంతరం ఆ జీవోను పక్కన పెట్టారని అన్నారు. ఏది ఏమైనప్పటికీ, ప్రభాత్ నగర్ పార్కు స్థలం వాకర్లకు అందుబాటులో ఉండేలా చూస్తామని, పార్కు వినియోగానికి ఆటంకం కలగకుండా గేటు ఏర్పాటు అంశంపై సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో వాకర్లు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను స్వయంగా పరిశీలించి పరిష్కారానికి హామీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, తోట మహేష్ యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, త్రివేది, పవన్, జయశ్రీ, గట్టు శీను, రమణారెడ్డి, కాలనీ అధ్యక్షుడు బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొర్రతాండలో ఎల్ నినో ప్రభావం నివారణ చర్యలపై అవగాహన

దేవరకొండ, నవంబర్05 జర్నలిస్ట్ డైరీ :
దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామం పరిధిలోని కొర్రతాండలో ఎల్ నినో ప్రభావం మరియు నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు, తీవ్ర కరువు ఏర్పడే అవకాశం ఉంది. ప్రతి ఒక్కరూ నీటిని, విద్యుత్ ను పొదుపుగా వాడుకోవాలి. చెట్లను నరకకుండా, నీటి వనరులను కాపాడుకోవాలి. భూగర్భ జలాలను పెంచేందుకు ఇంకుడు గుంతలు తవ్వాలి" అని కోరారు. అనంతరం గ్రామస్తులందరితో నీటి ప్రతిజ్ఞ చేయించారు. నీటిని వృధా చేయమని, ప్రతి చుక్కను ఒడిసిపడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు లికొర్ర లక్ష్మీ ప్రశాంత్, సునీత బద్దు, కొర్ర కిషన్,మాజీ సర్పంచులు కొర్ర పాండు, కొర్ర అంత్యా నాయక్, గ్రామ పెద్దలు లిశ్రీకాంత్, కెస్యా, జగన్,



జబ్బార్ లాల్, దీప్లా, పాండు, దకన, సూర్యా, శ్రీను, నరేష్, మాన్సింగ్ తదితరులు మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పులివెందుల ఎర్రిపల్లెలో పెట్రోల్ బాంబులతో దాడులు.. తీవ్ర ఉద్రిక్తత

-పులివెందుల ఎర్రిపల్లె పోలింగ్ కేంద్రం వద్ద తీవ్ర ఉద్రిక్తత
-వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం, ఘర్షణ
-ఇరు వర్గాలను చెదరగొట్టి, భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



పులివెందుల, జర్నలిస్ట్ డైరీ :
కడప జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ తీవ్ర ఉద్రిక్తతల మధ్య సాగుతోంది. పులివెందుల నియోజకవర్గంలో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. పులివెందుల మండలం ఎర్రిపల్లెలోని పోలింగ్ బూత్ వద్ద పరిస్థితి అదుపు తప్పి, పెట్రోల్ బాంబుల దాడుల వరకు వెళ్లింది.వివరాల్లోకి వెళ్తే, ఎర్రిపల్లెలోని పోలింగ్ కేంద్రం వద్దకు పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు చేరుకున్నారు. వారు పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, విధుల్లో ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఇదే సమయంలో అక్కడున్న టీడీపీ శ్రేణులకు, వైసీపీ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం మొదలైంది.
చూస్తుండగానే మాటల యుద్ధం ముదిరి, ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడులకు దిగాయి. పెట్రోల్ బాంబులు, రాళ్లు విసురుకోవడంతో అక్కడ భయానక వాతావరణం నెలకొంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా పోలింగ్ కేంద్రం వద్ద భారీగా బలగాలను మోహరించి, కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఈ ఘటనతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పోలింగ్‌పై ఆందోళన నెలకొంది.

పరిషత్ పోలింగ్‌లో ఉద్రిక్తత.. బ్యాలెట్ బాక్సును బద్దలుకొట్టిన వైసీపీ నేతలు!

-అనంతపురం జిల్లాలో వైసీపీ శ్రేణుల దౌర్జన్యం
-కూడేరు మండలం మరుట్లలోని పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ బాక్సు ధ్వంసం
-ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలు



అనంతపురం, జర్నలిస్ట్ డైరీ :
ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా అనంతపురం జిల్లాలో పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడ్డారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. కూడేరు మండలం మరుట్లలోని పోలింగ్ కేంద్రంలో వైసీపీ నేతలు వీరంగం సృష్టించారు. పోలింగ్ బూత్‌లో ఉన్న బ్యాలెట్ బాక్సును బయటకు లాక్కొచ్చి రాళ్లతో బద్దలుకొట్టారు. ఈ ఘటనను అడ్డుకోబోయిన పోలీసులపైనా వారు దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డారు.ఇదే తరహాలో జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ వైసీపీ శ్రేణులు దాడులకు దిగాయి. బ్రహ్మసముద్రం మండలం పోలేపల్లిలో పోలింగ్ కేంద్రం వెలుపల ఉన్న టీడీపీ కార్యకర్తలపై దాడి చేశారు. శెట్టూరు మండలం చిందర్లపల్లి లో ఏకంగా పోలింగ్ కేంద్రంలోకి చొరబడి టీడీపీ ఏజెంట్లపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడిన అమిలినేని యశ్వంత్ అనే కార్యకర్తను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు

బాణాసంచా విక్రయాల్లో నిబంధనలు కచ్చితంగా పాటించాలి

ప్రమాదాల నివారణకు అప్రమత్తంగా ఉండాలి: సీఐ వెంకటేశ్వర్లు

ఆమనగల్లు, నవంబర్ 05 జర్నలిస్ట్ డైరీ :
దీపావళి పండుగ నేపథ్యంలో బాణా సంచా విక్రయాల నిర్వహణ, భద్రతా చర్యలపై గురువారం ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ఆవరణలో బాణాసంచా యజమానులతో ఆమనగల్లు సీఐ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాణాసంచా విక్రయదారులకు పలు సూచనలు చేశారు.బాణాసంచా విక్రయాలకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ సూచించారు. లైసెన్సులు కలిగిన వారు మాత్రమే విక్రయాలు చేపట్టాలని, దుకాణాల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. దుకాణాల వద్ద అగ్నిమాపక పరికరాలు, ఇసుక, నీటిని అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా వ్యాపారులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సై సంతోష్ రెడ్డి, బాణాసంచా విక్రయదారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465